స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన రూ.12,500 కోట్ల నిధులు కోల్పోయే ప్రమాదం ఉంది. అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు, దాడులకు పాల్పడుతూ సుప్రీంకోర్టు తీర్పుపై తప్పుడు ప్రచారం చేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 30.10.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 189 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

నష్టమెంతైనా.. అండగా ఉంటాం!

- తుపాను బాధితులకు ముఖ్యమంత్రి భరోసా
- ప్రాథమికంగా రూ.4,600 కోట్ల నష్టం
- కేంద్ర బృందాలతో క్షేత్రస్థాయిలో నష్టాల పరిశీలన
- రైతులు, మత్స్యకారులు, పేద కుటుంబాలకు ప్రాధాన్యం

గచ్చకాయలపోర (కోనసీమ) (జర్నలిస్ట్ ఫైల్): అర్నబ్ తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఏరియల్ సర్వే నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని గచ్చకాయలపోర గ్రామాన్ని సందర్శించి, సహాయ పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుపాను కారణంగా జరిగిన నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను పరిశీలించారు.

అనంతరం గచ్చకాయలపోరలో మీడియాతో మాట్లాడుతూ.. అర్నబ్ తుపాను వల్ల రాష్ట్రంలో ప్రాథమికంగా రూ. 4,600 కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనా వేశామని చంద్రబాబు తెలిపారు. సమగ్ర నష్టం అంచనా పూర్తయిన తర్వాత ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు శుక్రవారం రాష్ట్రానికి రానున్నాయని వెల్లడించారు.

తుపాను ప్రభావంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడి రాష్ట్రంలో పరిస్థితిని వివరించడంతో పాటు, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, ప్రాథమిక నష్టం వివరాలతో నివేదిక సమర్పించినట్లు చంద్రబాబు తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకే స్వయంగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు.

తుపానులో దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు, ఆయిల్‌పామ్ చెట్టుకు రూ. 1,500 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్‌తో పాటు తక్షణ అవసరాల కోసం ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రైతులకు ఇప్పటికే పంటల బీమా అమలు చేశామని, దిగుబడులు తగ్గితే బీమా పరిహారం అందుతుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేసిన అనంతరం పరిహారాన్ని వీలైనంత త్వరగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

ప్రాణనష్టం తగ్గించేందుకు ముందస్తు చర్యలు : ఆంధ్రప్రదేశ్ గతంలో ఎన్నో తుపానులను ఎదుర్కొందని చంద్రబాబు గుర్తుచేశారు. దివిసీమ తుపాను, హుద్‌హుద్, తిత్లీ, మొంథా తదితర తుపానులు రాష్ట్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయని తెలిపారు. గత విపత్తుల నుంచి పాఠాలు నేర్చుకుని ముందస్తు చర్యలు చేపట్టడం వల్ల ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని చెప్పారు. అయినప్పటికీ ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు.

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పరిస్థితిని పర్యవేక్షించినట్లు తెలిపారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రియల్‌టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ ద్వారా సహాయక చర్యలను సమన్వయం చేసినట్లు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలు తుపాను ప్రభావానికి ఎక్కువగా గురయ్యాయని తెలిపారు.

8 వేల విద్యుత్ స్తంభాలు ధ్వంసం : తుపాను కారణంగా కోనసీమ జిల్లాలోనే సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని చంద్రబాబు వెల్లడించారు. దెబ్బతిన్న స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. పునరుద్ధరణ పనులకు తెలంగాణ ప్రభుత్వం నుంచి 1,000 మంది విద్యుత్ సిబ్బందిని పంపించాలని కోరినట్లు చెప్పారు. అవసరమైతే కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా సిబ్బందిని రప్పిస్తామన్నారు. మిగతా 2లో...

ఆర్నబ్ తుఫాన్ వేళ
సమష్టి సేవాస్ఫూర్తి

- జనజీవనం సాధారణ స్థితికి వచ్చే వరకు అహర్నిశలు శ్రమించారు: నారా లోకేష్

అమరావతి, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్): ఆర్నబ్ తుఫాన్ బీభత్సం సృష్టించి వెళ్లిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు, నగరాలు తీవ్రంగా అస్తవ్యస్తమయ్యాయని తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులను చక్కదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు, సిబ్బంది, అధికారులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సేవలను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది నిద్రాహారాలు మాని పనిచేశారని తెలిపారు.

ప్రకృతి విపత్తు సమయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటై ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. జనజీవనం సాధారణ స్థితికి తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ చూపిన సేవాస్ఫూర్తి, సమష్టితత్వం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని నారా లోకేష్ పేర్కొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను కొనసాగిస్తూ, ప్రజలకు అవసరమైన అన్ని సేవలను వేగంగా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

పెట్టుబడులకు భారీ ఊతం.. పరిశ్రమలకు ప్రోత్సాహం

- 48 కీలక ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం
- అమరావతి నిర్మాణానికి రూ.1,925 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్
- భారీ పరిశ్రమలు, సెమీకండక్టర్, క్వాంటమ్ రంగాలకు ప్రాధాన్యం
- సాగునీరు, స్వచ్ఛ ఇంధనం, పర్యాటక రంగాలకూ ప్రోత్సాహం

అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతమిచ్చేలా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వర్చువల్‌గా జరిగిన మంత్రివర్గ సమావేశంలో 48 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. మిగతా 2లో...

గ్యాస్ డెలివరీకి ఓటీపీ అక్కర్లేదు

- తుపాను ప్రభావిత 13 జిల్లాల్లో తాత్కాలిక మినహాయింపు
- విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యల నేపథ్యంలో నిర్ణయం
- నగదు చెల్లింపుతోనూ సిలిండర్ పొందేందుకు వెసులుబాటు
- సజావుగా గ్యాస్ సరఫరా చేసేందుకే కేంద్రం చర్యలు

2 లో

బంగాళాఖాతంలో అల్పపీడనం

- వాయుగుండంగా బలపడే అవకాశం
- నవంబరు 1, 2న కోస్తాకు వర్షాలు
- రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచన

2 లో

పారిశుద్ధ్యానికి ప్రత్యేక దళం

- తుపాను ప్రభావిత జిల్లాలకు 100 ప్రత్యేక బృందాలు
- తొమ్మిది జిల్లాల నుంచి 475 మంది సిబ్బంది
- అంటువ్యాధుల నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- తాగునీటి పరీక్షలకు 48 మంది సాంకేతిక సిబ్బంది
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఏర్పాటు

అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటయ్యాయి. తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు 475 మందితో కూడిన ప్రత్యేక సిబ్బందిని నియమించారు. మిగతా 2లో...

తుపానులోనూ వైద్య సేవలు

- 3,100 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలింపు
- 367 ప్రసవాల నమోదు
- అత్యవసర సేవలకు 485 అంబులెన్సులు
- 64 ఆసుపత్రుల భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం

2 లో

అమరావతి, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్): తుపాను సమయంలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ప్రసవ సమయం దగ్గరపడిన, అధిక ప్రమాద గర్భిణులను గుర్తించి ఆసుపత్రులకు తరలించడంతో పాటు అంబులెన్సులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు, సంచార వైద్య వాహనాలను అందుబాటులో ఉంచింది.

రైతు నష్టంపై సమగ్ర సర్వే

- ప్రతి పొలాన్నీ పరిశీలించి సమగ్ర నష్టం అంచనా వేయాలి
- 16 జిల్లాల్లో 3.52 లక్షల హెక్టార్లలో పంటలు నీటమునక
- పంటలను కాపాడేందుకు క్షేత్రస్థాయికి శాస్త్రవేత్తలు
- వ్యవసాయ, అనుబంధ శాఖలకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): ఆర్నాబ్ తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖలకు సంభవించిన నష్టాలపై రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, నాలుగు శాఖల కమిషనర్లు, డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఒక్కరైతుకూ అన్యాయం జరగకుండా సమగ్ర నష్టాల అంచనా చేపట్టడంతో పాటు తక్షణ చర్యల ద్వారా పంటలను కాపాడేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 16 జిల్లాల పరిధిలో 291 మండలాలు, 7,613 గ్రామాల్లో 5,42, 003 మంది రైతులకు చెందిన 3,51, 962.60 హెక్టార్లలో పంటలు నీటమునిగాయి. ఇందులో వరి పంటే 3,45,582. 60 హెక్టార్లలో ప్రభావితమైంది. 15 జిల్లాల్లోని 215 మండలాలు, 1,218 గ్రామాల్లో 77,431 మంది రైతులకు చెందిన 22,457.75 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మిగతా 2లో...

నావిగేషన్‌కు మరింత బలం

- ఎన్‌వీఎస్-03తో మెరుగుపడనున్న భారత నావిగేషన్ సేవలు
- జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్18 ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభం
- త్వరలో గగన్‌యాన్ డీ-1 ప్రయోగం
- వరుస ప్రయోగాలకు ఇస్రో సన్నాహాలు
- ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్

నెల్లూరు , అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్): భారత నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం కీలక అడుగు కానుందని ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ తెలిపారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలోని గ్రామదేవత శ్రీ చెంగాళమ్మను గురువారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

షార్‌లో చేపట్టనున్న జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి పూజలు చేసినట్లు నారాయణన్ తెలిపారు. ప్రయోగానికి 24 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. రాత్రి 11.51 గంటలకు రాకెట్‌ను నింగిలోకి పంపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు.

జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్18 ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. మిగతా 2లో...

ఆంధ్ర-ఒడిశా మధ్య రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో ఉప్పొంగిన నదులు, జలపాతాలు
- రెండు రాష్ట్రాలను కలిపే వంతెనపై వరద ఉద్ధృతి
- జోలాపుట్ రిజర్వాయర్‌కు పోటెత్తిన వరద
- ప్రవాహం తగ్గేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచన

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): తుఫాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షాల వల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థ తీవ్రంగా స్తంభించిపోయింది. జలపాతాలు, నదులు ఉప్పొంగి మిగతా 2లో...

పారిశుద్ధ్యానికి ప్రత్యేక దళం

(మొదటి పేజీ తరువాయి)

ఈ రెండు జిల్లాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం మొత్తం 100 ప్రత్యేక బృందాలను కేటాయించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 55 బృందాలు, పశ్చిమ గోదావరి జిల్లాకు 45 బృందాలను పంపనున్నారు. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల నుంచి మొత్తం 475 మంది సిబ్బందిని ఈ పనుల కోసం కేటాయించారు. క్షేత్రస్థాయిలో నాలుగేసి మంది సభ్యులతో బృందాలను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులను ముందుకు తీసుకువెళ్లనున్నారు. తుపాను కారణంగా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఏర్పడిన నీటి నిల్వలను తొలగించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, బ్లీచింగ్, క్లోరినేషన్ చేపట్టడం వంటి పనులకు ఈ ప్రత్యేక బృందాలు ప్రాధాన్యం ఇవ్వనున్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, జనావాసాల మధ్య నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టనున్నాయి.

భారీ వర్షాలు, వరద నీటి కారణంగా గ్రామాల్లో అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేసేలా ఏర్పాట్లు చేశారు.

తాగునీటి నాణ్యత పరీక్షలకు ప్రత్యేక బృందాలు : తుపాను ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వాటర్ టెస్టింగ్ బృందాలను కూడా ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. అందుకోసం కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు కలిపి 48 మంది సాంకేతిక సిబ్బందిని కేటాయించారు. ఈ బృందాల్లో డీఈ, ఏఈలు, కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉంటారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తాగునీటి వనరులు, సరఫరా అవుతున్న నీటి నాణ్యతను అక్కడికక్కడే ఈ బృందాలు పరీక్షిస్తాయి. నీటి పరీక్షల్లో నాణ్యతకు సంబంధించిన ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించనున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తారు. నీటి సరఫరాలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దేలా చర్యలు చేపట్టనున్నారు. కలుషిత నీటి కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ బృందాలు ఏర్పాటయ్యాయి.

తుపాను ప్రభావిత గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి నాణ్యతపై

ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ముఖ్యంగా తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న రెండు జిల్లాల్లో స్థానిక సిబ్బందికి అదనంగా ఇతర జిల్లాల నుంచి ప్రత్యేక బృందాలను పంపడం ద్వారా సహాయక, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాల్లో నీటి నిల్వలు తొలగించడం, మురుగు శుభ్రం చేయడం, తాగునీటి నాణ్యతను నిరంతరం పరిశీలించడం ద్వారా ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

నష్టమెంతైనా.. అండగా ఉంటాం!

(మొదటి పేజీ తరువాయి)

రహదారులపై పడిపోయిన చెట్లను తొలగించే పనులు తుపాను తగ్గిన వెంటనే ప్రారంభించినట్లు తెలిపారు. సాగునీటి చెరువులకు గండ్లు పడకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించామని, ప్రమాదకర ప్రాంతాల్లో యంత్రాలను ముందుగానే మోహరించి చెట్లను తొలగించినట్లు వివరించారు.

బాధితుల సమస్యలపై తక్షణ స్పందన : తుపాను ప్రభావంతో గుడిసెలు కూలిపోయాయని పలువురు మహిళలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, దెబ్బతిన్న గుడిసెలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఇంటి స్థల పట్టాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

పడవల రిజిస్ట్రేషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు చెప్పగా, వారి సమస్యను పరిష్కరించి పడవల రిజిస్ట్రేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తుపాను సహాయక చర్యల్లో అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేశారని చంద్రబాబు తెలిపారు. సుమారు 30 వేల మంది అధికారులను రంగంలోకి దించి ముందస్తు చర్యలు చేపట్టడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని చెప్పారు. విమర్శలు, రాజకీయ వ్యాఖ్యలకు అధికారులు ప్రభావితం కాకుండా ప్రజల భద్రత, సంక్షేమంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపారు.

ప్రతి వ్యక్తికి పాలన చేరాలి : "పాలన ప్రతి ఒక్కరికీ చేరాలి. ఎవరూ ప్రభుత్వ సాయం అందక ఇబ్బందులు పడకూడదు" అనేదే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. బాధిత రైతులు, మత్స్యకారులు, పేద కుటుంబాలు, ఇతర బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ సహాయక చర్యలు, నష్టం అంచనా, పునరుద్ధరణ పనులను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గ్యాస్ డెలివరీకి ఓటీపీ అక్కర్లేదు

అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): అర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో గృహ వినియోగ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో ఓటీపీ ధృవీకరణ నుంచి తాత్కాలిక మినహాయింపు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా సజావుగా కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ తాత్కాలిక వెసులుబాటు రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో వర్తించనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఓటీపీ ధృవీకరణలో ఇబ్బందులు తలెత్తకుండా, గృహ వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందించేందుకు ఈ మినహాయింపు దోహదపడనుంది. నగదు చెల్లింపు ద్వారా సిలిండర్లను నేరుగా పొందే విధానానికి కూడా అనుమతి కల్పించినట్లు పేర్కొంది. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన నిత్యావసర సేవల్లో అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులు, గ్యాస్ పంపిణీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్-నికోబార్ దీవుల పరిసరాల్లో మరింత స్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొంది.

ఆ తర్వాతి 24 గంటల్లో ఈ వ్యవస్థ మరింత బలపడి ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర పరిసరాల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని కదలిక, తీవ్రత ఆధారంగా తదుపరి ప్రభావాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో లినవంబర్ 1, 2 తేదీల్లో కోస్తాంధ్రలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశంలి ఉందని అధికారులు తెలిపారు. వాయుగుండం ఏ దిశగా కదులుతుంది, దాని తీవ్రత ఎంతవరకు ఉంటుంది అనే అంశాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

ప్రజలు వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసే తాజా హెచ్చరికలను గమనించాలని అధికారులు సూచించారు. రైతులు, మత్స్యకారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో వాయుగుండం కదలికలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండనుంది.

ఈవీఎంలైనా.. బ్యాలెట్ పేపర్లైనా కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు



అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): ఈవీఎంలైనా, బ్యాలెట్ పేపర్లైనా కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలు చేస్తూ, ఓటు చోరీ పేరుతో ప్రచారం సాగిస్తోందని విమర్శించారు.

ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి గురువారం మీడియాకు ప్రకటన విడుదలైంది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల విధానం మారినంత మాత్రాన విజయాలు దక్కవని మాధవ్ పేర్కొన్నారు. ఈవీఎంలపై ఆరోపణలు చేయడం, బ్యాలెట్ పేపర్ల కోసం డిమాండ్ చేయడం ద్వారా ప్రజల తీర్పును మార్చలేరని అన్నారు.

ప్రజాదరణ లేని పార్టీకి సాకులే ఆధారం : ప్రజల మద్దతు పొందేందుకు స్పష్టమైన విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విశ్వసనీయ నాయకత్వం అవసరమని మాధవ్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టకుండా, ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేస్తూ తన రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎన్ని ప్రచారాలు చేసినా, ఎన్ని కారణాలు చెప్పినా ప్రజల తీర్పే అంతిమమని ఆయన అన్నారు.

ఎన్నికల ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయవద్దని కాంగ్రెస్‌కు సూచించారు.

ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని, ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు రాజకీయ పార్టీలు తమ విధానాలు, కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

రైతు నష్టంపై సమగ్ర సర్వే

(మొదటి పేజీ తరువాయి)

SDRF నిబంధనల ప్రకారం ప్రాథమిక ఇన్‌పుట్ సబ్సిడీ అంచనా రూ. 99.23 కోట్లుగా నమోదైంది. 12 జిల్లాల్లో 46 ఆవులు, గేదెలు, 63 గొర్రెలు, మేకలు, 32 దూడలు, 7,656 కోళ్లు మృతి చెందాయి. మరో 140 పశువుల షెడ్లు దెబ్బతిన్నాయి. ప్రాథమిక ఆర్థిక సహాయం అంచనా రూ. 50.38 లక్షలుగా నిర్ధారించారు. 9 జిల్లాల్లో 1,884 పడవలు, 3,224 వలలు దెబ్బతినగా, 11,483.39 ఎకరాల ఆక్వా సాగు ప్రభావితమైంది. 61 చెరువులకు నష్టం వాటిల్లింది. మొత్తం ప్రాథమిక నష్టాన్ని రూ. 176.82 కోట్లుగా అంచనా వేశారు.

ఒక్క రైతూ మినహాయింపునకు గురికాకుండా నష్టాల నమోదు : అక్టోబర్ 30 నుంచి నాలుగు శాఖల సిబ్బంది పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ప్రతి రైతును సంప్రదించి, ప్రతి పొలాన్ని పరిశీలించి పంట విస్తీర్ణం, నష్టం తీవ్రతను కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతు వివరాలు మిస్ కాకుండా, నష్టాన్ని పాక్షికంగా నమోదు చేసే పొరపాట్లకు తావులేకుండా నాణ్యమైన ఎన్యూమరేషన్ చేపట్టాలని సూచించారు. నష్టాల నమోదుకే పరిమితం కాకుండా మరింత పంట నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి నిర్దేశించారు. ముఖ్యంగా రాబోయే రెండు మూడు రోజులు అత్యంత కీలకమని, పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, పంటలకు అవసరమైన మందులు, పోషకాలు అందించడం, శాస్త్రీయ పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా సాధ్యమైనంత మేర పంటలను కాపాడాలని

ఆదేశించారు.

నాలుగు విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయికి వెళ్లాలి : నాలుగు వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు తమ పరిధిలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలందరికీ ప్రభావిత ప్రాంతాలవారీగా ప్రత్యేక బాధ్యతలు కేటాయించాలని మంత్రి సూచించారు. ప్రతి శాస్త్రవేత్త స్వయంగా రైతులను కలిసి పంటల పరిస్థితిని పరిశీలించి, నష్టాన్ని తగ్గించేందుకు అవసరమైన శాస్త్రీయ సలహాలు, నివారణ చర్యలను సూచించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రొఫెసర్, శాస్త్రవేత్తకు ప్రాంతాలవారీగా ప్రత్యేక జాబ్ చార్ట్ రూపొందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ సందర్శించిన గ్రామాలు, పరిశీలించిన పంటలు, కలిసిన రైతుల సంఖ్య, సలహాలు అందించిన పంట విస్తీర్ణం, సూచించిన నివారణ చర్యలతో కూడిన నివేదికలను సంబంధిత వైస్ ఛాన్సలర్లు సమర్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

సెల్ఫ్ ఎన్యూమరేషన్ వివరాలను క్రాస్ వెరిఫై చేయాలి : ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ యాప్ ద్వారా రైతులు నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి సూచించారు. వాస్తవ పంట విస్తీర్ణం, నష్టం తీవ్రత ఆధారంగా కచ్చితమైన నివేదికలు రూపొందించడంతో పాటు రైతుల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశించారు. నాలుగు శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది సెలవులను రద్దు చేయాలని, అత్యవసర వైద్య కారణాలు వంటి అనివార్య పరిస్థితుల్లో మాత్రమే అనుమతించాలని మంత్రి ఆదేశించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో జాప్యం జరగకుండా సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాలకు తుఫాను ప్రభావం లేని ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని తక్షణమే నియమించాలని సూచించారు.

అక్టోబర్ 30న జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమీక్ష : నష్టాల అంచనాలో జాప్యం, సిబ్బంది కొరత, ఇతర సమస్యలు ఎదురవుతున్న జిల్లాలను గుర్తించి ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

అక్టోబర్ 30 సాయంత్రం సంబంధిత జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకూ న్యాయం జరగాలి. ప్రతి పొలాన్ని పరిశీలించి సమగ్ర నష్టాల అంచనా వేయాలి. అదే సమయంలో పంటలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి. అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేసి రైతులకు క్షేత్రస్థాయిలో భరోసా కల్పించాలి. నష్టాన్ని అంచనా వేయడంతో పాటు నష్టాన్ని తగ్గించడంపైనా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

పెట్టుబడులకు భారీ ఊతం.. పరిశ్రమలకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి నిర్మాణం, భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్ తయారీ, క్వాంటమ్ టెక్నాలజీ, సాగునీరు, స్వచ్ఛ ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

అమరావతికి భారీ నిధులు : అమరావతి ప్రభుత్వ సముదాయంలోని జీఏడీ టవర్‌లో విద్యుత్, శీతలీకరణ, అగ్నిమాపక భద్రత, లిఫ్టులు, ఫైర్ అలారాలు, పబ్లిక్ అడ్రస్ వ్యవస్థ, ప్లంబింగ్ తదితర మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులకు రూ. 448.31 కోట్ల టెండర్‌కు ఆమోదం లభించింది. టవర్లు 1, 2లో పనులకు రూ. 768.89 కోట్లు, టవర్లు 3, 4లో పనులకు రూ. 708.12 కోట్ల కాంట్రాక్టులకు కూడా అనుమతి ఇచ్చారు. మూడు పనుల మొత్తం విలువ రూ. 1,925.33 కోట్లుగా ఉంది. అత్యల్ప బిడ్డర్లకు పనులు అప్పగించే అధికారాన్ని ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు కల్పించారు.

భారీ పరిశ్రమలకు భూకేటాయింపులు : పారిశ్రామిక అభివృద్ధి విధానం-4.0 కింద పలు భారీ ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పించింది. విశాఖపట్నం అడవివరం, ముడసర్లోవ ప్రాంతాల్లో 5.84 ఎకరాల జీవీఎంసీ భూమిని విజాగ్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు.

విజయనగరం జిల్లా శ్రీరాంపురంలో రూ. 5,194 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుతో సుమారు 3,000 మందికి ఉపాధి లభించనుంది. రెనైసాన్స్ సోలార్ అండ్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్‌కు 91.10 ఎకరాలు కేటాయించి రూ. 3,700 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సమీకృత సిలికాన్ క్రిస్టల్, వేఫర్ తయారీ కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు.

పరిశ్రమలకు వరుస ప్రోత్సాహకాలు : రామ్‌కో సిమెంట్స్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభ గడువు సవరణ, అదనపు ప్రోత్సాహకాలు, తొమ్మిది సంస్థలకు ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్ కింద మూలధన రాయితీల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శ్రీ సిమెంట్‌కు కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని ఎస్. ఉప్పలపాడులో 452 ఎకరాలు, జై రాజ్ ఇస్పాత్‌కు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుట్టపాడులో 418.55 ఎకరాలు కేటాయించనున్నారు.

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం అల్లంపాడులో సన్‌షైన్ ఎనర్జిటిక్స్‌కు 455.91 ఎకరాలు, దుత్తలూరులో మునీష్ డిఫెన్స్ సొల్యూషన్స్‌కు 250 ఎకరాలు, ఆదిత్య ప్రెసిటెక్‌కు 300 ఎకరాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం మీదివేములలో జాక్సన్ సోలార్ ఇంటిగ్రేటెడ్‌కు 290 ఎకరాలు కేటాయించేందుకు ఆమోదం లభించింది.

రిలయన్స్ ప్రాజెక్టుకు ఆమోదం : కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ శీతల పానీయాలు, జ్యూస్‌లు, ప్యాకేజ్డ్ తాగునీటి తయారీ కేంద్రం ఏర్పాటుకు రూ. 2,606 కోట్ల సవరించిన పెట్టుబడి ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. రక్షణ పరిశ్రమల క్లస్టర్ కోసం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో 713.04 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువ ఆధారంగా ఏపీఐఐసీకి బదిలీ చేయనున్నారు.

క్వాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యం : ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల రంగాల అభివృద్ధికి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సుమారు 250 ఎకరాల్లో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ పార్కు ఏర్పాటు చేసేందుకు అవసరమైన బడ్జెట్ సహకారానికి ఆమోదం తెలిపారు.

సాగునీటి పనులకు రూ.698.90 కోట్లు : కృష్ణా జిల్లాలో మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే కోటపాడు, చనుబండ, విస్సన్నపేట లిఫ్ట్ పథకాల పనుల కొనసాగింపునకు రూ. 698.90 కోట్ల ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల కొనసాగింపునకు కూడా అనుమతి ఇచ్చారు. రాయలసీమ స్టీల్ సంస్థకు 2029 అక్టోబరు వరకు తాత్కాలిక ప్రాతిపదికన ఏటా 0.025 టీఎంసీల నీటిని కేటాయించేందుకు నిర్ణయించారు.

స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహం : సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం-2024 కింద బయోగ్యాస్, పవన విద్యుత్, పవన-సౌర హైబ్రిడ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు కల్పించనున్నారు. చిత్తూరు జిల్లా విజయపురం మండలం కలియంబాక్కంలో ఐరా బయోఎనర్జీ రోజుకు 12 టన్నుల సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఆంధ్రా షుగర్స్ రోజుకు 10 టన్నుల సామర్థ్యంతో మరో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెల్లి పరిసరాల్లో విండోరా ఎనర్జీకి 500 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు కేటాయింపునకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

పర్యాటక రంగానికీ ప్రోత్సాహం : పరిశ్రమలతో పాటు పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వనుంది. కాకినాడలో లాలా ల్యాండ్ వాటర్ అండ్ అమ్యూజ్‌మెంట్ పార్కు అభివృద్ధికి మాన్ ప్రకృతి గ్రూప్‌కు ప్రోత్సాహకాలు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. అనంతపురంలో రాయల్ ఆర్కిడ్స్ బ్రాండ్‌తో ఫోర్‌స్టార్ హోటల్ ఏర్పాటుకు స్కై రిట్రీట్స్‌కు ప్రోత్సాహకాలు అందించనున్నారు.

అదేవిధంగా వివిధ జిల్లాల్లో పారిశ్రామిక, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను ఏపీఐఐసీకి బదిలీ చేసే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. 2026-27 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించిన ప్రభుత్వ హామీలను కూడా మంత్రివర్గం ఆమోదించింది. నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశం కార్యాచరణ నివేదికను పరిశీలించిన మంత్రివర్గం, అర్నబ్ తుపాను పరిస్థితులపై రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖ సమర్పించిన నివేదికపై కూడా చర్చించింది.

తుపానులోనూ వైద్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

తుపాను కారణంగా 64 ఆసుపత్రులకు నష్టం జరిగినంది.

గర్భిణులకు ముందస్తు వైద్య సాయం : ప్రసవానికి రెండు వారాల్లోపు గడువు ఉన్న, అధిక ప్రమాద గర్భిణులు కలిపి 4,228 మందిని గుర్తించి, 3,100 మందిని ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 690 మందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, 83 మందిని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, 430 మందిని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, 442 మందిని ప్రాంతీయ ఆసుపత్రులకు, 132 మందిని జిల్లా ఆసుపత్రులకు, 456 మందిని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రులకు, 762 మందిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 367 మందికి ప్రసవాలు జరిగాయి

అత్యవసర వైద్య సేవలు : తుపాను సమయంలో 485 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. వీటి ద్వారా 43 మందిని ఆసుపత్రులకు తరలించారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవల కింద 196 వాహనాలను అందుబాటులో ఉంచగా, వీటి ద్వారా 15 మందిని ఆసుపత్రులకు తరలించారు. అలాగే 549 సంచార వైద్య వాహనాలను సిద్ధంగా ఉంచి, 50 వైద్య శిబిరాలు నిర్వహించారు.

ఆసుపత్రులకు జరిగిన నష్టం : తుపాను కారణంగా పలు ఆసుపత్రుల్లో భవనాలు, పైకప్పులు, విద్యుత్తు పరికరాలు, జనరేటర్లు, నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. కైకలూరు, బారువ, టెక్కలి, అగనంపూడి, పెందుర్తి, నక్కపల్లి, నర్సీపట్నం, రేపల్లె, అమలాపురం, రంపచోడవరం, ముమ్మిడివరం, అల్లవరం, కొత్తపేట, నెల్లిమర్ల ఆసుపత్రుల్లో నష్టం నమోదైంది. పెనుమంట్ర, దేవపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రహరీ గోడలు దెబ్బతిన్నాయి. ఏలూరు, గుంటూరు, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో విద్యుత్తు తీగలు, జనరేటర్లు, ఇతర పరికరాలు, మౌలిక సదుపాయాలకు నష్టం జరిగింది. విశాఖపట్నంలోని ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో ఆపరేషన్ గదుల పైకప్పుల నుంచి నీరు కారడం, పాత భవనంలోని పలు ప్రాంతాల్లో నీరు లీకవడం, కిటికీలు, తలుపులు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తాయి.

నావిగేషన్‌కు మరింత బలం

(మొదటి పేజీ తరువాయి)

భారత నావిగేషన్ వ్యవస్థలో ఇది ఐదో ఉపగ్రహమని, దేశంలో నావిగేషన్ సేవల సామర్థ్యాన్ని మరింత మెరుగు పరచడంలో ఈ ప్రయోగం ఉపయో గపడుతుందని తెలి పారు.

దేశీయ అంతరిక్ష కార్య క్రమాలను మరింత వేగ వంతం చేసేందుకు ఇస్రో ప్రణాళికలు రూపొంది స్తోందని నారాయణన్ చెప్పారు. రాబోయే రోజుల్లో పలు కీలక ప్రయోగాలను వరుసగా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. గగన్‌యాన్ కార్యక్రమంలో భాగంగా డీ-1 ప్రయోగాన్ని కూడా త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు ఇస్రో ప్రాధాన్యం ఇవ్వనుందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ రంగానికి ప్రయోగ సేవలు, సాంకేతిక సహకారం అందించడం ద్వారా దేశ అంతరిక్ష రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

నావిగేషన్ సేవలు రవాణా, కమ్యూనికేషన్లు, వ్యవసాయం, విపత్తుల నిర్వహణతో పాటు అనేక కీలక రంగాలకు ఉపయోగపడుతున్న నేపథ్యంలో ఎన్‌వీఎస్-03 వంటి ఉపగ్రహాల ప్రయోగాలు దేశ సాంకేతిక స్వావలంబనకు మరింత దోహదపడతాయని ఇస్రో ఛైర్మన్ వివరించారు.

ఆంధ్ర-ఒడిశా మధ్య రాకపోకలు బంద్



(మొదటి పేజీ తరువాయి)

ప్రవహిస్తుండటంతో సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనికితోడు జోలాపుట్ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం ఒక్కసారిగా పోటెత్తింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలను కలిపే ప్రధాన వంతెనపై నుంచి వరద నీరు అత్యంత ఉధృతంగా పారుతోంది. రహదారిపై ప్రవాహం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణం చేయడం ప్రమాదకరంగా మారింది. ప్రవాహ వేగానికి వాహనాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉండటంతో ఆంధ్ర నుంచి ఒడిశాకు, అలాగే ఒడిశా నుంచి ఆంధ్రకు ఇరువైపులా రాకపోకలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. వంతెన ఇరువైపులా పోలీసులు, స్థానిక యంత్రాంగం రక్షణ చర్యలు చేపడుతూ, ప్రజలెవరూ వంతెన దాటేందుకు ప్రయత్నించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. వరద ప్రవాహం తగ్గేవరకూ ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ఇరు రాష్ట్రాల అధికారులు సూచిస్తున్నారు.

తుఫాను నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

రైతులకు అండగా నిలవాలి: ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): ఆర్నబ్ తుఫాను ప్రభావంతో కొల్లిపర మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. అత్తోట, సిరిపురం, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో పర్యటించి పంటల పరిస్థితిని, రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

పొలాల్లో పర్యటించిన ఆలపాటి రైతులతో మాట్లాడి తుఫాను కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. సాగు కోసం పెట్టిన పెట్టుబడులు, పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యంతో నష్టం వాటిల్లడంతో రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అన్నదాతలు నష్టపోవడం బాధాకరమని, రైతుల కష్టకాలంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

"రైతు కంట కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదు. అన్నదాతకు అండగా నిలవడం మనందరి బాధ్యత" అని ఆలపాటి అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, కూలీల కోసం రైతులు భారీగా ఖర్చు చేస్తున్నారని, పంట చివరి దశలో దెబ్బతింటే వారి కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతుందని తెలిపారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి రైతుకు జరిగిన నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. వాస్తవ నష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదించి, నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు తక్షణ సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యవసాయ సలహాలు, సాంకేతిక సహకారం అందించాలని ఆలపాటి సూచించారు. కొల్లిపర మండలంలో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించాలని అధికారులను కోరారు.

రైతులు ధైర్యంగా ఉండాలని, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆలపాటి భరోసా ఇచ్చారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు.

ఆలపాటి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు నవంబర్ 2న ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలి

- **ప్రభుత్వాన్ని, ఎన్నికల అధికారులను కోరిన ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

అమరావతి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): నవంబర్ 1న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు నవంబర్ 2న ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల అధికారులను కోరారు.

ఎన్నికల విధుల్లో నియమితులైన ఉద్యోగులు ఎన్నికల సామగ్రి స్వీకరణ నుంచి పోలింగ్ నిర్వహణ, అనంతరం ఎన్నికల సామగ్రిని అప్పగించే వరకు వివిధ బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో ఉద్యోగులు సాధారణ విధి సమయం కంటే ఎక్కువసేపు విధుల్లో ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు.

అదేవిధంగా దూర ప్రాంతాల్లో పోలింగ్ విధులకు నియమితులైన ఉద్యోగులు ప్రయాణపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఎన్నికల విధులు పూర్తయ్యే సమయానికి సిబ్బంది తీవ్ర అలసటకు గురవుతారని తెలిపారు.

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికల నిర్వహణ కీలకమైనదని, ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారని విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల శ్రమను, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ఈ నేపథ్యంలో నవంబర్ 2న ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఉద్యోగులకు అవసరమైన విశ్రాంతి లభించడంతో పాటు, ప్రయాణం, విధి నిర్వహణకు సంబంధించిన ఇబ్బందులు కొంతవరకు తగ్గుతాయని తెలిపారు.

గుంటూరు అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలి

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపునకు ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులకు మద్దతు తెలపాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మేయర్ కోవెలమూడి నాని, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు నగరంలోని 25,26 డివిజన్లలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు.. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలుపై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు స్థానిక కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా మాజీ మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ.. గుంటూరు నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. తాను మేయర్‌గా ఉన్న సమయంలో దాదాపు రూ.600 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు మంజూరు తీసుకొచ్చామని తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేల సహకారంతో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. గతంలో పలు ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో రహదారులు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని గల్లా మాధవి తెలిపారు. కూటమి నాయకుల కృషితోనే అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని అన్నారు. స్థానికంగా అభివృద్ధిని కొనసాగించేందుకు ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో గుంటూరు నగరానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోందని తెలిపారు.

పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకం వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందని వివరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ, నగర ప్రగతికి ప్రజల సహకారం అవసరమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు.

ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ కోరారు. ఏపీ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ ఆర్. వెంకటరమణను ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారు సంచాలకుడి దృష్టికి తీసుకెళ్లారు. వివిధ కేడర్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాలని అలపర్తి విద్యాసాగర్ కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 100 శాతం గ్రాస్ అమలును త్వరగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శాఖాపరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డాక్టర్ ఆర్. వెంకటరమణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పెండింగ్ అంశాలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఎన్జీజీఓ నాయకులు సీవీఆర్ ప్రసాద్, శివలీలతో పాటు రాష్ట్ర, జిల్లా, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

హాఫ్‌పేట, కొలకలూరులో ఆలపాటి విస్తృత ప్రచారం

- **ప్రజల ఆశీస్సులతో గ్రామాభివృద్ధికి కృషి**
- **ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యం**
- **ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**

తెనాలి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): తెనాలి మండలంలోని హాఫ్‌పేట, కొలకలూరు గ్రామాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెనాలి మండల జడ్పీటీసీ అభ్యర్థి నన్నపనేని అన్నపూర్ణతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రచారంలో భాగంగా ప్రతి ప్రాంతంలో ప్రజలతో మమేకమైన ఆలపాటి.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తోందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపే నాయకత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

ప్రజల విశ్వాసమే అభ్యర్థులకు బలం: ప్రజల విశ్వాసం, ఆశీస్సులే ప్రజాప్రతినిధులకు అసలైన బలమని ఆలపాటి అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములయ్యే నాయకులకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. హాఫ్‌పేట, కొలకలూరు గ్రామాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రతి ఓటరును మర్యాదపూర్వకంగా కలిసి అభ్యర్థుల ప్రణాళికలను, గ్రామాభివృద్ధిపై వారి ఆలోచనలను వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు.

గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం: ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకే గ్రామాభివృద్ధిని పరిమితం చేయకుండా, ప్రజల అవసరాలను నిరంతరం గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆలపాటి పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో చొరవ చూపాలని అన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్న ఆలపాటి.. ప్రజల ఆశీస్సులతో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా కృషి చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి నన్నపనేని అన్నపూర్ణ, ఎంపీటీసీ అభ్యర్థులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఫైల్
JOURNALIST FILE
సంపాదక స్వరం
EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

పుంజుకుంటున్న ప్రైవేట్ పెట్టుబడులు..

వృద్ధికి కొత్త ఊపిరి

ప్రభుత్వ పెట్టుబడుల తర్వాత ఇప్పుడు ప్రైవేట్ రంగం వంతు.. స్థిరమైన వృద్ధికి ఇదే కీలకం

ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం ఎంత పెట్టుబడి పెట్టినా, దానికి ప్రైవేట్ రంగం చేయూత లేకపోతే వృద్ధి ఒక దశకు మించి వేగం పుంజుకోవడం కష్టం. రహదారులు, రైల్వేలు, విద్యుత్, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తే అది ఆర్థిక వ్యవస్థకు పునాది వేస్తుంది. కానీ ఆ పునాదిపై కర్మాగారాలు నిర్మించేది, కొత్త వ్యాపారాలు ప్రారంభించేది, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేది, పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టించేది ప్రధానంగా ప్రైవేట్ రంగమే. అందుకే భారత ఆర్థిక వ్యవస్థలో కొంతకాలంగా ఎదురుచూస్తున్న ప్రైవేట్ పెట్టుబడుల పునరుజ్జీవనంలిలి ఇప్పుడు కీలక మలుపుగా మారుతోంది.

మాజీ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్, ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి శక్తికాంత దాస్ ఇటీవల ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడుల చక్రంలో పునరుద్ధరణకు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కోవిడ్ అనంతర కాలంలో సంస్థలు తమ రుణభారాన్ని తగ్గించుకోవడం, బ్యాలెన్స్‌షీట్లను బలోపేతం చేసుకోవడం, లాభదాయకతను మెరుగుపరుచుకోవడం వంటి చర్యలు ఇప్పుడు కొత్త పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయని ఆయన అభిప్రాయం. పారిశ్రామిక రంగానికి బ్యాంకు రుణాల వృద్ధి దాదాపు 20 శాతానికి చేరుకోవడం కూడా ప్రైవేట్ మూలధన వ్యయ చక్రం పుంజుకుంటున్న తొలి సంకేతంగా ఆయన అభివర్ణించారు.

ఇది సాధారణ పరిణామం కాదు. గత కొన్నేళ్లుగా భారత ఆర్థిక వృద్ధికి ప్రధాన ఆధారంగా నిలిచింది ప్రభుత్వ మూలధన వ్యయం. మౌలిక సదుపాయాలపై కేంద్రం భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా డిమాండ్‌ను నిలబెట్టింది. ఆ పెట్టుబడులు రోడ్లు, రైల్వేలు, విద్యుత్, లాజిస్టిక్స్, పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణకు దోహదపడ్డాయి. ఇప్పుడు ఆ ప్రభుత్వ వ్యయానికి ప్రైవేట్ రంగ పెట్టుబడులు తోడైతే ఆర్థిక వ్యవస్థలో మరింత బలమైన పెట్టుబడి చక్రం ఏర్పడే అవకాశం ఉంది.

ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది : కంపెనీలు పెట్టుబడి పెట్టాలంటే మార్కెట్‌లో డిమాండ్ ఉండాలి. ఉత్పత్తి పెంచితే కొనుగోలుదారులు ఉండాలి. కొత్త కర్మాగారం ఏర్పాటు చేస్తే దానికి విద్యుత్, రవాణా, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, సులభమైన రుణాలు, స్థిరమైన విధాన వాతావరణం అందుబాటులో ఉండాలి. అంతేకాకుండా ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, వాణిజ్య విధానాలు, ముడిసరుకుల ధరలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు కూడా పెట్టుబడి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి.

అందువల్ల ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకుంటున్నాయనే సంకేతాలను స్వాగతించాల్సిందే. కానీ వాటిని స్థిరమైన పెట్టుబడి చక్రంగా మార్చడం కోసం విధానపరమైన స్థిరత్వం మరింత అవసరం.

బలపడిన కార్పొరేట్ బ్యాలెన్స్‌షీట్లు : కోవిడ్ అనంతరం భారతీయ కంపెనీలు ఎదుర్కొన్న ప్రధాన సవాళ్లలో అధిక రుణభారం ఒకటి. అయితే అనేక సంస్థలు గత కొన్నేళ్లలో రుణాలను తగ్గించుకుని, ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకున్నాయి. లాభదాయకత పెరగడం, వడ్డీ చెల్లింపుల సామర్థ్యం మెరుగుపడటం వంటి పరిణామాలు ఇప్పుడు కొత్త పెట్టుబడులకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నాయి.

శక్తికాంత దాస్ పేర్కొన్నట్లుగా, సంస్థల ఆర్థిక పునరుద్ధరణ కొత్త పెట్టుబడుల సామర్థ్యాన్ని పెంచుతోంది. తాజాగా పారిశ్రామిక రంగానికి బ్యాంకు రుణాల వృద్ధి దాదాపు 20 శాతానికి చేరడం కూడా ఈ మార్పుకు సంకేతంగా కనిపిస్తోంది.

అయితే రుణం పెరగడం మాత్రమే పెట్టుబడి పెరిగిందని అర్థం కాదు. రుణం ఎక్కడికి వెళ్తోంది? ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి ఉపయోగిస్తున్నారా? కొత్త కర్మాగారాలు, యంత్రాలు, సాంకేతికతలో పెట్టుబడి పెడుతున్నారా? లేక ప్రస్తుత కార్యకలాపాలకే పరిమితమవుతున్నారా? అనే అంశాలను కూడా గమనించాలి.

ఉద్యోగాల సృష్టి కూడా జరగాలి : భారతదేశానికి ప్రైవేట్ పెట్టుబడులు ఎందుకు అవసరమన్న ప్రశ్నకు ప్రధాన సమాధానం ఉద్యోగాలు. పెట్టుబడులు పెరిగి ఉత్పత్తి పెరిగినా ఉద్యోగాలు తగిన స్థాయిలో పెరగకపోతే ఆర్థిక వృద్ధి సమాజంలోని అన్ని వర్గాలకు సమాన ప్రయోజనం అందించదు.

ప్రస్తుతం డేటా సెంటర్లు, కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు పెరుగుతున్నాయి. ఇవి భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన రంగాలే. అయితే ఉద్యోగాల పరంగా భారీ ఉపాధి కల్పించే తయారీ రంగం, ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కూడా పెట్టుబడులు సమానంగా చేరాలి. ప్రస్తుత పెట్టుబడి ఉత్సాహం కొంతవరకు సేవలు, సాంకేతిక రంగాల వైపు ఎక్కువగా కేంద్రీకృతమవుతున్నదన్న ఆందోళన కూడా ఉంది.

అందుకే 'పెట్టుబడి ఎంత?' అనే ప్రశ్నతో పాటు 'పెట్టుబడి ఎక్కడ?' 'ఎన్ని ఉద్యోగాలు?' 'ఎంత స్థానిక విలువ సృష్టి?' అనే ప్రశ్నలకు కూడా సమాధానం అవసరం.

బ్యాంకింగ్ రంగం బాధ్యత : ప్రైవేట్ పెట్టుబడుల పునరుద్ధరణలో బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం పాత్ర కీలకం. పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, కొత్త తరం తయారీ రంగాలకు దీర్ఘకాలిక మూలధనం అవసరం. కేవలం సంప్రదాయ కార్పొరేట్ రుణాలకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక మూలధన సమీకరణకు ఆర్థిక సంస్థలు నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని దాస్ సూచించారు. సెమీకండక్టర్లు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, రక్షణ ఉత్పత్తి వంటి వ్యూహాత్మక రంగాలకు ఆర్థిక మద్దతు పెంచాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

ఇదే సమయంలో చిన్న, మధ్యతరహా సంస్థలు, వ్యవసాయ రంగానికి రుణ సౌకర్యం విస్తరించాలి. భారత ఆర్థిక వ్యవస్థలో ఉపాధి, ఉత్పత్తి, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఎంఎస్ఎంఈలు కీలకమైనవి. పెద్ద కంపెనీలకు మాత్రమే పెట్టుబడి అవకాశాలు పరిమితమైతే వృద్ధి విస్తృతంగా ప్రజలకు చేరదు.

భారతదేశాన్ని కేవలం మార్కెట్‌గా కాకుండా ఉత్పత్తి కేంద్రంగా మార్చాలి : ప్రపంచ కంపెనీలు భారతదేశాన్ని కేవలం తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసే దేశంగా కాకుండా దీర్ఘకాలిక సామర్థ్య నిర్మాణానికి అనువైన ప్రదేశంగా చూడటం మరింత ముఖ్యమైన పరిణామం. విద్యుత్, డేటా సెంటర్లు, లోహాలు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో కొత్త ప్రాజెక్టులపై ఆసక్తి పెరుగుతున్నట్లు ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల శాఖ కూడా పేర్కొంది. 2026–27 తొలి త్రైమాసికంలో స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సుమారు 30 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని కూడా వెల్లడించింది.

ఇది భారతదేశానికి ఒక గొప్ప అవకాశం. ప్రపంచ సరఫరా గొలుసుల్లో మార్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, దేశాల మధ్య పెరుగుతున్న వాణిజ్య పోటీ నేపథ్యంలో విశ్వసనీయమైన తయారీ కేంద్రంగా భారత్ ఎదగడానికి అవకాశం ఉంది.

కానీ ఆ అవకాశాన్ని వాస్తవ పెట్టుబడులుగా మార్చాలంటే భూమి, విద్యుత్, రవాణా, నైపుణ్యాలు, పన్ను వ్యవస్థ, అనుమతుల ప్రక్రియ, న్యాయపరమైన స్పష్టత వంటి అంశాల్లో మరింత సులభతరం అవసరం.

వృద్ధి నుంచి అభివృద్ధి వైపు : ప్రైవేట్ పెట్టుబడుల పునరుజ్జీవనం భారతదేశానికి కేవలం జీడీపీ వృద్ధిని పెంచే సాధనం కాదు. ఇది ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని మార్చగల అవకాశం. కొత్త పరిశ్రమలు వస్తే సరఫరా గొలుసులు విస్తరిస్తాయి. చిన్న సంస్థలకు వ్యాపారం పెరుగుతుంది. నైపుణ్యాభివృద్ధికి డిమాండ్ పెరుగుతుంది. ఎగుమతులు పెరుగుతాయి. పన్ను ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగాలు సృష్టించబడతాయి. అయితే ఈ ప్రయోజనాలు ఆటోమేటిక్‌గా రావు. పెట్టుబడులు లిలిఉత్పాదక రంగాలకు, ఉపాధి సృష్టించే రంగాలకు, సాంకేతిక సామర్థ్యాన్ని పెంచే రంగాలకులిలి చేరేలా విధానాలు ఉండాలి.

భారతదేశం ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది. ప్రభుత్వ పెట్టుబడులు పునాది వేశాయి. కార్పొరేట్ బ్యాలెన్స్‌షీట్లు బలపడుతున్నాయి. బ్యాంకు రుణాలు పెరుగుతున్నాయి. కొత్త రంగాల్లో పెట్టుబడుల అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఈ సంకేతాలన్నీ ప్రైవేట్ పెట్టుబడి చక్రం మళ్లీ కదులుతున్నదన్న ఆశను కలిగిస్తున్నాయి. ఇప్పుడు అవసరమైనది ఆ ఆశను ఆర్థిక వాస్తవంగా మార్చడం.

ప్రభుత్వం పునాది వేయాలి.. ప్రైవేట్ రంగం ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించాలి.. బ్యాంకులు మూలధనాన్ని అందించాలి.. ఎంఎస్ఎంఈలు ఉపాధిని విస్తరించాలి.. ప్రజలకు ఆ వృద్ధి ఫలాలు అందాలి.

అప్పుడే ప్రైవేట్ పెట్టుబడుల పునరుజ్జీవనం ఒక ఆర్థిక వార్తగా మిగలదు. అది భారతదేశాన్ని లిలివేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి అధిక ఆదాయ, అధిక ఉత్పాదకత కలిగిన అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చే కీలక అడుగుగా నిలుస్తుంది.

భారత వృద్ధి కథలో ప్రభుత్వం ఇంజిన్‌ను నడిపింది. ఇప్పుడు ప్రైవేట్ రంగం ఆ ఇంజిన్‌కు మరో శక్తివంతమైన బోగీని జోడించాల్సిన సమయం వచ్చింది. లిలిపెట్టుబడి పెరిగితేనే ఉత్పత్తి పెరుగుతుంది.. ఉత్పత్తి పెరిగితేనే ఉద్యోగాలు పెరుగుతాయి.. ఉద్యోగాలు పెరిగితేనే వృద్ధి ప్రజల జీవితాల్లో కనిపిస్తుంది. ఇదే ప్రైవేట్ పెట్టుబడుల పునరుజ్జీవనానికి అసలైన అర్థం.

ఉద్యోగాల కోత.. బాధ్యత ఎవరిది?

- **ఏఐ పేరుతో ఉపాధి సంక్షోభాన్ని సమర్థించగలమా?**

టెక్నాలజీ రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారిన ఈ కాలంలో ఉద్యోగాల కోతలు ఆందోళన కలిగించే స్థాయికి చేరుతున్నాయి. ఒకప్పుడు ఐటీ రంగాన్ని భవిష్యత్తు ఉద్యోగాలకు అత్యంత భద్రమైన గమ్యస్థానంగా భావించారు. ఇంజినీరింగ్ చదివితే ఉద్యోగం.. ఉద్యోగం వస్తే మంచి జీతం.. కొన్నేళ్లలో విదేశీ అవకాశం.. ఇదే లక్షలాది మధ్యతరగతి కుటుంబాల కల. కానీ ఇప్పుడు ఆ భరోసా ప్రశ్నార్థకమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా టెక్ సంస్థలు భారీగా ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. ఈ పరిస్థితిని కేవలం కంపెనీల వ్యాపార నిర్ణయంగా తీసిపారేయలేం.

కంపెనీలకు లాభాలు ముఖ్యం. ఖర్చులు తగ్గించుకోవడం కూడా వ్యాపారంలో భాగమే. కానీ లాభాలు పెరిగినప్పుడు ఉద్యోగులకు వాటా ఇచ్చే సంస్థలు, నష్టాలు లేదా వ్యూహాత్మక మార్పులు వచ్చినప్పుడు మాత్రం ఉద్యోగులనే మొదటి బలిగా ఎందుకు ఎంచుకుంటున్నాయి? ఇదే ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న.

కృత్రిమ మేధ, ఆటోమేషన్ వల్ల ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ఇది సాంకేతిక పరిణామంలో సహజమైన దశ కావచ్చు. కానీ ఏఐని కారణంగా చూపి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం మాత్రమే పరిష్కారమా? అదే సాంకేతికతను అభివృద్ధి చేసిన కంపెనీలు తమ ఉద్యోగులను కొత్త నైపుణ్యాలతో తీర్చిదిద్దే బాధ్యత తీసుకోకూడదా? ఉద్యోగులను తొలగించే ముందు రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ అవకాశాలను కల్పించడం కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగం కావాలి.

భారతదేశానికి ఈ సమస్య మరింత తీవ్రమైనది. మన దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ పట్టాలు పొందుతున్నారు. కుటుంబాలు భారీగా ఖర్చు చేసి పిల్లలను చదివిస్తున్నాయి. విద్యార్థులు రుణాలు తీసుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. చివరకు ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి ఎదురైతే ఆ కుటుంబాల భవిష్యత్తు ఏమిటి?

ఇక్కడ ప్రభుత్వ బాధ్యతను కూడా ప్రశ్నించాల్సిందే. నైపుణ్యాభివృద్ధి పేరుతో అనేక పథకాలు, కార్యక్రమాలు ప్రకటించడం మాత్రమే సరిపోదు. పరిశ్రమలో వాస్తవంగా ఏ నైపుణ్యాలకు డిమాండ్ ఉందో గుర్తించి, విద్యా వ్యవస్థను దానికి అనుగుణంగా మార్చాలి. ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, క్లౌడ్ టెక్నాలజీ వంటి రంగాల్లో నాణ్యమైన శిక్షణ అందుబాటులోకి రావాలి. ముఖ్యంగా గ్రామీణ, మధ్యతరగతి విద్యార్థులకు ఈ అవకాశాలు చేరాలి.

మరోవైపు కంపెనీలకు కూడా ఒక ప్రశ్న ఉంది. ఉద్యోగులను కేవలం 'ఖర్చు'గా చూడటం ఎంతవరకు సమంజసం? ఒక సంస్థను నిర్మించేది కేవలం సాఫ్ట్‌వేర్, సర్వర్లు, పెట్టుబడులు కాదు. అక్కడ పనిచేసే మనుషుల నైపుణ్యం, అనుభవం, శ్రమ కూడా సంస్థ ఆస్తే. వ్యాపార పరిస్థితులు మారినప్పుడు ఉద్యోగులను తొలగించడం చివరి మార్గంగా ఉండాలి. పని గంటల పునర్వ్యవస్థీకరణ, అంతర్గత బదిలీలు, శిక్షణ, కొత్త విభాగాల్లో అవకాశాలు వంటి ప్రత్యామ్నాయాలను ముందుగా పరిశీలించాలి.

అయితే యువత కూడా వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. ఇకపై ఒక్క డిగ్రీతో ఉద్యోగ భద్రత సాధ్యమయ్యే కాలం కాదు. ఒకే సాంకేతికతపై ఆధారపడటం ప్రమాదకరం. నిరంతరం నేర్చుకోవడం, కొత్త సాంకేతికతలను అర్థం చేసుకోవడం, మానవీయ నైపుణ్యాలను పెంచుకోవడం తప్పనిసరి.

ఏఐని ఆపడం సాధ్యం కాదు. సాంకేతిక పురోగతిని వెనక్కి తిప్పడం కూడా సాధ్యం కాదు. కానీ సాంకేతిక పురోగతి ఫలాలు కొద్దిమందికే, దాని భారాన్ని లక్షలాది ఉద్యోగులకే మిగిలే విధానం మాత్రం అంగీకారయోగ్యం కాదు.

ప్రభుత్వం ఉపాధి కేంద్రిత విధానాలను రూపొందించాలి. కార్పొరేట్ రంగం ఉద్యోగుల పట్ల బాధ్యత వహించాలి. విద్యాసంస్థలు భవిష్యత్ నైపుణ్యాలకు అనుగుణంగా మారాలి. యువత నిరంతర అభ్యాసాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి.

అభివృద్ధి అంటే యంత్రాల సామర్థ్యం పెరగడం మాత్రమే కాదు. ఆ అభివృద్ధిలో మనిషి జీవితం మరింత భద్రంగా మారడమే నిజమైన ప్రగతి. ఉద్యోగాలను సృష్టించే సాంకేతికత కావాలి.. ఉద్యోగాలను కేవలం తొలగించే సాంకేతికత కాదు.

ప్రాణాలు కాపాడాల్సిన మందులే ప్రాణాంతకమైతే?

నకిలీ ఔషధాలపై ఉక్కుపాదం అవసరం

ఒక మాత్రను చేతిలోకి తీసుకున్నప్పుడు రోగి దానిలోని రసాయనాలను పరిశీలించడు. ప్యాకెట్‌పై ఉన్న పేరు, కంపెనీ గుర్తు, ధర, తయారీ తేదీ, గడువు తేదీ చూసి అది అసలైన మందేనని నమ్ముతాడు. వైద్యుడు రాసిన మందును ఫార్మసీలో కొనుగోలు చేసి, ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆశతో వేసుకుంటాడు. కానీ అదే మందు నకిలీదైతే? ప్రాణాలను కాపాడాల్సిన ఔషధమే ప్రాణాలకు ముప్పుగా మారితే? ఇది కేవలం వైద్యరంగానికి సంబంధించిన సమస్య కాదు. ఇది ప్రజల ప్రాణాలతో ముడిపడిన అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సమస్య.

దేశంలో నకిలీ, కల్తీ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని ఔషధాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఔషధ నియంత్రణ సంస్థలు చేపట్టిన పరీక్షల్లోనూ అనేక నమూనాలు నాణ్యతా ప్రమాణాలను అందుకోలేదని తేలడం సమస్య తీవ్రతను సూచిస్తోంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ప్రతి నాణ్యతా లోపం ఉన్న మందును 'నకిలీ మందు'గా పిలవడం సరికాదు. ప్రభుత్వ నిబంధనల్లో 'నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ', 'స్పూరియస్', 'అడల్టరేటెడ్', 'మిస్‌బ్రాండెడ్' వంటి విభిన్న వర్గీకరణలు ఉన్నాయి. 'కౌంటర్‌ఫీట్ మెడిసిన్' అనే పదానికి ప్రత్యేక నిర్వచనం ప్రస్తుత డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టంలో లేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది.

అయితే పేరు ఏదైనా.. ప్రమాదం మాత్రం ఒకటే-రోగి ఆరోగ్యం దెబ్బతినడం : 2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1,16,323 ఔషధ నమూనాలను పరీక్షించగా, 3,104 నమూనాలు 'నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ'గా, 245 నమూనాలు స్పూరియస్ లేదా కల్తీగా గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించని సంస్థలపై చర్యలు కూడా చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.

ఇక్కడ అసలు ప్రశ్న-ఇంతటి పర్యవేక్షణ ఉన్నప్పటికీ నకిలీ మందులు మార్కెట్‌లోకి ఎలా వస్తున్నాయి?

ఔషధాల తయారీ నుంచి పంపిణీ, హోల్‌సేల్, రిటైల్ వరకు ఒక పెద్ద సరఫరా గొలుసు ఉంటుంది. ఈ గొలుసులో ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలకు అవకాశం లభిస్తే నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి ప్రవేశించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ప్రముఖ బ్రాండ్ల పేర్లను పోలిన ప్యాకింగ్, నకిలీ లేబుల్స్, నకిలీ బ్యాచ్ నంబర్లు, గడువు తేదీల మార్పులు వంటి అక్రమాలు సాధారణ వినియోగదారుడికి గుర్తించడం అత్యంత కష్టం.



ఇది నకిలీ మందుల ముఠాలకు ప్రధాన బలం. వినియోగదారుడి కంటికి అసలైనదిగా కనిపించేలా తయారు చేస్తే చాలు.. నమ్మకం సంపాదించవచ్చు. రోగి మాత్రం మందులో ఉన్న అసలు పదార్థం ఏమిటో తెలుసుకునే పరిస్థితిలో ఉండడు.

ఇలాంటి మందులు ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మరింత ప్రమాదకరం. రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్, అంటువ్యాధులు వంటి తీవ్రమైన అనారోగ్యాలకు మందులు తీసుకునే రోగి నకిలీ లేదా నాణ్యత లేని మందు వాడితే చికిత్స ప్రభావం తగ్గడమే కాకుండా వ్యాధి అదుపు తప్పే ప్రమాదం ఉంటుంది. యాంటీబయాటిక్ మందుల్లో నాణ్యత లోపాలు, తప్పు మోతాదులు ఉంటే యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ వంటి పెద్ద ప్రజారోగ్య సమస్యలకు కూడా దారితీయవచ్చు.

అందువల్ల నకిలీ మందుల నియంత్రణను కేవలం దాడులు, కేసులు, అరెస్టులకే పరిమితం చేయకూడదు. తయారీ స్థాయి నుంచి రోగి చేతిలోకి చేరే వరకు ప్రతి దశను పర్యవేక్షించే వ్యవస్థ అవసరం.

ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టింది. 2022 డిసెంబర్ నుంచి కేంద్ర, రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థలు రిస్క్ ఆధారిత తనిఖీలను నిర్వహిస్తున్నాయి. 960కి పైగా ఔషధ తయారీ యూనిట్లను తనిఖీ చేసి, 860కి పైగా నియంత్రణ చర్యలు తీసుకున్నట్లు కేంద్రం 2026లో వెల్లడించింది. వీటిలో షోకాజ్ నోటీసులు, ఉత్పత్తి నిలిపివేత, లైసెన్సుల సస్పెన్షన్, రద్దు వంటి చర్యలు ఉన్నాయి.

అయితే తనిఖీల సంఖ్య పెరగడం ఒక్కటే పరిష్కారం కాదు. లిలిచర్యల వేగం, పారదర్శకత, శిక్షల తీవ్రత కూడా అంతే ముఖ్యం.

నకిలీ మందులను తయారు చేసే వ్యక్తి కేవలం చట్టాన్ని ఉల్లంఘించేవాడు కాదు. అతను ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే నేరానికి పాల్పడుతున్నాడు. అందువల్ల ఉద్దేశపూర్వకంగా నకిలీ మందులు తయారు చేసి, సరఫరా చేసే వారిపై వేగవంతమైన దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్, కఠినమైన శిక్షలు ఉండాలి. తప్పు చేసిన సంస్థల లైసెన్సులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. ఒక సంస్థ పేరు మార్చుకుని మళ్లీ అదే అక్రమ వ్యాపారాన్ని కొనసాగించే అవకాశాలు లేకుండా నియంత్రణ వ్యవస్థ పనిచేయాలి.

అదే సమయంలో ఔషధాల సరఫరా వ్యవస్థను సాంకేతికతతో బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఔషధాల ప్యాకేజింగ్‌పై ప్రత్యేకమైన బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు, ట్రాకింగ్ విధానాలను విస్తరించే చర్యలను కేంద్రం చేపట్టింది. 2026లో చేసిన నిబంధనల మార్పులతో వ్యాక్సిన్లు, యాంటీమైక్రోబయల్స్, యాంటీ క్యాన్సర్ మందులు, నార్కోటిక్ మరియు సైకోట్రోపిక్ ఔషధాల ట్రేసబిలిటీని మరింత విస్తరించే చర్యలు ప్రకటించబడ్డాయి.

ఇది సరైన దిశలో కీలకమైన అడుగు. అయితే సాంకేతికతతో పాటు ప్రజల్లో అవగాహన కూడా పెరగాలి. వినియోగదారులు వీలైనంత వరకు నమ్మకమైన లైసెన్స్డ్ ఫార్మసీల నుంచే మందులు కొనాలి. ప్యాకెట్ దెబ్బతిన్నదా, తయారీ వివరాలు స్పష్టంగా ఉన్నాయా, బ్యాచ్ నంబర్, తయారీ మరియు గడువు తేదీలు సరిగా ఉన్నాయా వంటి విషయాలను పరిశీలించాలి. అనుమానం కలిగించే మందులను ఉపయోగించకుండా వైద్యుడు లేదా ఫార్మసిస్ట్ సలహా తీసుకోవాలి.

ముఖ్యంగా ఆన్‌లైన్‌లో అతి తక్కువ ధరకు లభిస్తున్న మందుల విషయంలో అప్రమత్తత అవసరం. తక్కువ ధర కనిపించిందని ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం సమంజసం కాదు. లిలిమందు ధరలో కొంత ఆదా కోసం ప్రాణాలనే ప్రమాదంలోకి నెట్టకూడదు.

రాష్ట్రాల ఔషధ నియంత్రణ శాఖల పాత్ర ఇక్కడ కీలకం. పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలు, అనధికార సరఫరా కేంద్రాలు, హోల్‌సేల్ మార్కెట్లు, గోదాములపై కూడా నిరంతర నిఘా అవసరం. అంతర్రాష్ట్ర నకిలీ ఔషధ నెట్‌వర్క్‌లను గుర్తించేందుకు వివిధ రాష్ట్రాల డ్రగ్ కంట్రోల్ విభాగాలు, పోలీసు శాఖలు, కస్టమ్స్, సైబర్ విభాగాలు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలి.

మరో ముఖ్యమైన అంశం–నకిలీ మందులపై సమాచారం ప్రజలకు త్వరగా అందాలి. నాణ్యతా ప్రమాణాలు విఫలమైన మందుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచే 'డ్రగ్ అలర్ట్' వ్యవస్థను కేంద్రం ఇప్పటికే అమలు చేస్తోంది. అయితే ఆ సమాచారాన్ని సాధారణ ప్రజలకు అర్థమయ్యే భాషల్లో, మొబైల్ ద్వారా సులభంగా చేరేలా చేయాలి.

చివరగా గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. లిలిఔషధం సాధారణ వస్తువు కాదు. అది ఒక రోగి ప్రాణంపై ఉన్న ఆశ.లిలి ఆ ఆశను మోసం చేసే నకిలీ మందుల వ్యాపారం ఎంత పెద్ద ఆర్థిక నేరమో అంతకంటే పెద్ద మానవతా నేరం. నకిలీ మందుల నియంత్రణలో ప్రభుత్వం, ఔషధ నియంత్రణ సంస్థలు, పోలీసులు, ఔషధ తయారీ సంస్థలు, ఫార్మసీలు, వైద్యులు, వినియోగదారులు–ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణానికి ముప్పుగా మారే రంగం ఇది.

అందుకే నకిలీ మందులపై పోరాటం 'తనిఖీ–చర్య–శిక్ష' అనే మూడు దశలకే పరిమితం కాకుండా 'నిరోధం–నిఘా–నిర్ధారణ–జవాబుదారీతనం' అనే సమగ్ర విధానంగా మారాలి.

ప్రాణాలను కాపాడాల్సిన మందులు మార్కెట్‌లోకి వస్తున్నాయంటే అవి నిజంగా మందులేనా అన్న ప్రశ్న తలెత్తకూడదు. ప్రతి మాత్రపై ప్రజలకు నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని కాపాడటం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత కాదు.. సమాజం మొత్తం బాధ్యత.

మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు!

- జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో 71 మంది పట్టివేత
- రూ.2,02,500 జరిమానా.. గరిష్ఠంగా 14 రోజుల జైలు శిక్ష విధించిన న్యాయస్థానం
- వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలి: ట్రాఫిక్ సీఐ కె. శివశంకర్

జవహర్‌నగర్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : కనగల్లు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు గ్రహీత డాక్టర్ కంబాల శివలీలా రెడ్డి అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో బస్ స్టాండ్ కంట్రోలర్ మట్టపల్లి వెంకటేశ్వర్లు,చింతల వెంకన్న, కవిత,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సతివాడ బాలగోపాల్ జన్మదిన వేడుకలు

శేరిలింగంపల్లి, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :

మియాపూర్ ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యుడు సతివాడ బాలగోపాల్ పుట్టినరోజు సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ బాలగోపాల్ ను కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు, స్థానిక నాయకులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ప్రసాద్, ఎం ఆర్ కె చౌదరి, దోప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, వరుణ్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), మూర్తి,పవన్, అభిజిత్, రాము, యశ్వంత్, నాని పాల్గొని బాలగోపాల్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కేక్ కట్ చేయించి సాంప్రదాయ శాలువాతో ఆయనను సత్కరించడం గౌరవం, సద్భావనకు చిహ్నం గా నిలిచింది.

బీజేపీ మహా పాదయాత్రకు విస్తృత ఏర్పాట్లు చేయాలి: ఆలె భాస్కర్

శేరిలింగంపల్లి, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : నవంబర్ 2న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జి ఆలె భాస్కర్ పిలుపునిచ్చారు. హఫీజ్‌పేట్ ప్రజయ్ సిటీలో డివిజన్ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, డివిజన్, బూత్ కమిటీల ఏర్పాటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, మహా పాదయాత్రకు జన సమీకరణపై చర్చించారు. డివిజన్‌లో టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.సమావేశంలో బీజేపీ నాయకులు సురభి రవీందర్ రావు, డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి, మూల అనిల్ గౌడ్, బోయిని అనూష మహేష్ యాదవ్, సజ్జ కోటేశ్వరరావు, రవి గౌడ్, ఆళ్ల వరప్రసాద్, జగన్ గౌడ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

- వ్యసనాలకు దూరంగా ఉండాలి.. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలి

కేశంపేట, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :

కేశంపేట మండలం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మై భారత్ రంగారెడ్డి ఆధ్వర్యంలో యువజన పార్లమెంటు కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువత ఆరోగ్యంపై వాటి ప్రభావం, కుటుంబాలు, సమాజంపై పడే దుష్పరిణామాలను వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని అధికారులు పిలుపునిచ్చారు. తాము వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు తోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. యువతలో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మై భారత్ రంగారెడ్డి ఉపసంచాలకుడు నేహాల్ బసత్కర్, జిల్లా యువజన అధికారులు అరుషి, స్వాతి, అదితి సింగ్, శ్రద్ధ, రాజేంద్ర వీర్, షాలోమ్, ఫిలిప్, అనుజ్, ఆదర్శ్, కొత్తపేట సర్పంచ్ హైమావతి జగదీశ్, చింతకుంటపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్, యువజన స్వచ్ఛంద కార్యకర్త ప్రవళిక, డీపీఓ శ్రీశైలం, కార్తీక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఆసిఫ్, నాగయ్య, లక్ష్మీరాజ్, సదానంద గౌడ్, ధ్రువ కుమార్, రాణి, శిరీష, అస్మ తదితరులు పాల్గొన్నారు. కళాశాల బోధనేతర సిబ్బంది మాచర్ల శ్రీనివాస్ కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

- ప్రతి వార్డులో అర్హులైన పట్టభద్రులను గుర్తించాలి
- పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి: మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్

శామీర్‌పేట, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :

పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ముడు చింతలపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ పిలుపునిచ్చారు. రానున్న రంగారెడ్డి–హైదరాబాద్–మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో డిగ్రీ పూర్తి చేసిన అర్హులను గుర్తించి, నిబంధనల ప్రకారం పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పట్టభద్రుల ఓటరు నమోదు, పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న శాసనమండలి ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ప్రతి వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరిస్తూ అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన వారు ఎవరూ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని అన్నారు.పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత నిబంధనల ప్రకారం తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా సహకరించాలని సమావేశంలో సూచించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జాము రవి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మోర్సుబాయి శశిరేఖ రామిరెడ్డి, కౌన్సిలర్లు మహేశ్వరి దంతు గౌడ్, చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, ర్యాకల నీరజ్ గౌడ్, అజయ్ పటేల్, మాధవి భూమేష్ గౌడ్, సరిత శ్రీనివాస్, గిరిపల్లి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మురళి గౌడ్, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, బుద్ధి ఆంజనేయులు, ఇస్తారి, గోపాల్, చిత్తారి యాదవ్, చిట్టయ్య గౌడ్, గౌస్ పాషా, రామ్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ సెట్, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్, భూపాల్‌రెడ్డి, సుధాకర్, నాగరాజ్, ప్రభాకర్, రమేష్, సాగర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరగుట్ట వినాయక నగర్‌లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ప్రతిష్ఠాపనలో తోకల శ్రీనివాస్ రెడ్డి.

రాజేంద్రనగర్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :

రాజేంద్రనగర్ నియోజకవర్గం,మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉరగుట్ట వినాయక నగర్‌లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై,స్థానిక నాయకులు,భక్తులతో కలిసి ప్రతిష్ఠాపన మండప దేవతా పూజలు,ఆంజనేయ స్వామి వారి అభిషేకం, మంత్ర హోమం, రుద్ర హోమం, గణపతి హోమం, ఆంజనేయ స్వామి ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.భక్తులందరూ ఐకమత్యంతో కలిసి ఇంతటి పవిత్రమైన ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పంచముఖ అభయాంజనేయ స్వామి వారి దేవాలయ కమిటీ సభ్యులకు, భక్త బృందానికి, స్థానిక యువకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శేషిధర్ రెడ్డి, గడ్డం మల్లేష్ యాదవ్, విష్ణు వర్ధన్ రెడ్డి, మహేందర్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, రాకేష్ రెడ్డి,లోకేష్ ముదిరాజ్, తరుణ్, నర్సింగ్ ముదిరాజ్, సురేందర్ రెడ్డి, రఘు, శంకర్ రెడ్డి, ప్రభాకర్, భుజంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదు సరే, నిరుద్యోగ సమస్యల పరిష్కారమేది?

- రాజీవ్ యువ వికాసం, స్వయం ఉపాధి రుణాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మల్లెబోయిన ఉపేందర్

నేలకొండపల్లి, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమం కొనసాగుతున్న వేళ.. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.డిగ్రీలు పూర్తి చేసిన యువత ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎంతమంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు? అర్హులైన దరఖాస్తుదారుల్లో ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు.స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన యువతకు రుణాలు, సబ్సిడీలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. పథకాలను ప్రకటించడానికే పరిమితం కాకుండా, వాటి ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో నిరుద్యోగులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని కోరారు.ఖమ్మం—వరంగల్—నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో యువత, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీను, సభ్యులు నవీన్, అఖిల్ పాల్గొన్నారు.

కొత్త ప్రివిలేజ్ ఫీజుతో రోడ్డున పడుతున్న బార్లు

ఖమ్మం, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :

ఇప్పటికే అనేక సమస్యలతో నష్టాల్లో కొనసాగుతున్న బార్లపై కొత్తగా విధించిన ప్రివిలేజ్ ఫీజు మరింత ఆర్థిక భారాన్ని మోపుతోంది. బార్ యజమానులతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంది.— బార్లను నష్టపరుస్తున్న అంశాలుదాబాలు, బెల్ట్ షాపుల పెరుగుదల. ఖమ్మం నగరం చుట్టుపక్కల రోజురోజుకూ పెరుగుతున్న దాబాలు, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాల కారణంగా బార్ల అమ్మకాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.కొత్త వైన్ షాపుల ఏర్పాటు. ప్రతి రెండేళ్లకోసారి ప్రకటించే మద్యం పాలసీ ద్వారా కొత్త వైన్ షాపులు పెరుగుతుండటంతో బార్ల వ్యాపారంపై మరింత ప్రభావం పడుతోంది. పెరిగిన లైసెన్స్ ఫీజుల భారం, ఖమ్మం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మారిన నేపథ్యంలో పెరిగిన బార్ లైసెన్స్ ఫీజులు యజమానులపై అదనపు ఆర్థిక భారంగా మారాయి. మద్యం అమ్మకాలపై లాభాన్ని కూడా కోల్పోతున్న పరిస్థితి, బార్ లైసెన్స్‌పై లభించే ఏడు రెట్ల మద్యం స్టాక్‌ను పూర్తిస్థాయిలో లిఫ్ట్ చేయలేకపోతున్నాము. దీంతో ఇన్వాయిస్ ధరకు, ఎంఆర్‌పీకి మధ్య లభించే లాభశాతాన్ని కూడా బార్లు కోల్పోతున్నాయి.ఉపాధి కోల్పోయే ప్రమాదంలో కార్మికులు, ఒక్కో బార్‌పై ఆధారపడి దాదాపు 20 నుంచి 30 మంది ఉపాధి పొందుతున్నారు. ప్రివిలేజ్ ఫీజు భారం ఇలాగే కొనసాగి బార్లు మూతపడితే, వీరంతా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. వీరి కుటుంబాల జీవనాధారం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఏడాదికి రూ.30 లక్షల వరకు అదనపు భారం, కొత్త ప్రివిలేజ్ ఫీజు కారణంగా ఒక్కో బార్‌పై ఏడాదికి రూ.30 లక్షల వరకు అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న బార్లకు ఈ భారం భరించలేనిదిగా మారుతోంది.కావున ప్రభుత్వం సంబంధిత జీవోపై పునరాలోచించి, బార్ యజమానులకు ఉపశమనం కల్పించాలని కోరుతున్నాము. బార్ యజమానుల కుటుంబాలతో పాటు, ప్రత్యక్షంగా, పరోక్షంగా బార్లపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా చూడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం
- ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే 76 వ వ్యవస్థాపక వేడుకలు

హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : మనిషి కి ప్రాణవాయువు ఎలాగో, సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు కూడా అలాగే అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సూర్యుడు లేని సమాజం ఏ విధంగా ఉంటుందో జర్నలిస్టులు లేని సమాజం కూడా అదే విధంగా ఉంటుందని అన్నారు.జర్నలిస్టులు సమాజానికి దిశా నిర్దేశం చేసే వారని, అటువంటి జర్నలిస్టులు నేడు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి లో గల త్యాగరాయ గాన సభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురు సీనియర్ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ,పాత్రికేయులు సమాజానికి వెలుతురులాంటి వారని, పాత్రికేయులే లేకపోతే సమాజం చీకటిమయమవుతుందని అన్నారు.ఒకప్పుడు పత్రికలు, పాత్రికేయులంటే సమాజానికి, ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేసే స్థాయిలో ఉండేదని, కానీ ప్రస్తుతం రాజకీయ నాయకులు, పాలకులు జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయమై చాలా నిర్లక్ష్యం చేశాయని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సుముఖంగా ఉన్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు బాధ్యతగా అన్ని విధాలుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్నారు. మీడియా సంస్థలు, విద్యా, వైద్య సంస్థలు చదువుకున్న వారి చేతిలో లేవని, కేవలం పెట్టుబడిదారుల చేతుల్లో మాత్రమే ఉన్నాయని, అందుకే సమాజంలో ఇటు పత్రికలకు అటు జర్నలిస్టులకు విలువలు లేకుండా పోయాయని విమర్శించారు. గతంలో పత్రికలు నిజాలు మాత్రమే రాసేవని, పత్రికలో అగ్గిపెట్టెంత వార్త వస్తే ఎంతో స్పందన వచ్చేదని, ప్రస్తుతం నిజాలు రాసే పత్రికలు కరువయ్యాయని అన్నారు. సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు సంక్షేమ ప్రయోజనాలు సమకూర్చకపోవడం దారుణమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్క రంగానికి ఏదో ఒక లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం చాలా బాధాకరమని అన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో ముందున్న జర్నలిస్టులు తమ సమస్యలను తాము పరిష్కరించుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. జర్నలిస్టులకు భూముల్లేవు, జాగలు లేవు, హెల్త్ కార్డులు లేవు, సంక్షేమ పథకాలు లేవని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టు సంఘటితంగా తమ యూనియన్ల హయాంలో ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ గా తనకు జర్నలిస్టుల తో విడదీయరాని అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమ సమయం లో సైతం జర్నలిస్టులతో కలిసి పోరాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, అందుకే జర్నలిస్టుల కష్ట సుఖాలు తనకు తెలుసని ప్రొఫెసర్ పురుషోత్తం అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులను సన్మానించడం అభినందనీయమని, ఇది సమాజంలో మంచి సాంప్రదాయమని అన్నారు. సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ పాత్రికేయులను మర్చిపోకుండా గౌరవించుకోవాలని, ఈ సాంప్రదాయం ఇకముందు కూడా ఇలాగే కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ, దేశంలో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక మొదటి యూనియన్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అని అన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం సాధన కై దేశవ్యాప్తంగా పోరాడుతుందని, అదేవిధంగా రిటైర్డ్ పాత్రికేయుల కోసం జాతీయ పెన్షన్ పథకం,జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం ఉద్యమిస్తుందని అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘానికి అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బలోపేతమై త్వరలో జర్నలిస్టుల సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తుందని మామిడి సోమయ్య వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టి. ఉడయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామ కుమార్, సిబి లక్ష్మి, యర్రమిల్లి రామారావు తదితరులను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవి కుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, ఎం. రవి కుమార్, రాష్ట్ర నాయకులు పి.ఆనందం, కె.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పట్ల అప్రమతంగా ఉండాలి - విద్యుత్ శాఖ ఏఈ జీ. రవి

నేలకొండపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్నాబ్ తుఫాన్ తీవ్ర రూపం దాలుస్తున్నందున్న వ్యవసాయ క్షేత్రాలలో ఉన్న రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నేలకొండపల్లి విద్యుత్ శాఖ ఏఈ జీ.రవి సూచించారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...పొలం లో తెగి ఉన్న విద్యుత్ వైర్ల ను గుర్తించిన వెంటనే మా సిబ్బంది కి తెలపగలరని సూచించారు. తడి చేతులతో మోటార్ల స్విచ్ బోర్డులను తాక వద్దని సూచించారు. విద్యుత్ స్థంభాలకు లేదా సపోర్ట్ వైర్ లకు పశువులను కట్టి వేయటం లేదా చేతులతో తాకవద్దని సూచించారు. కాలం చెల్లిన లేదా జాయింట్లు ఉన్నా సర్వీస్ వైర్ల లను మార్పిడి చేసుకోగలరని కోరారు. విద్యుత్ వైర్ల మీద చెట్లు కొమ్మలు 'పడిన ఎడల తమకు సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ట్రాన్స్ఫర్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోయిన యెడల స్వయంగా స్థంబాలు ఎక్కడం, ట్రాన్స్ఫర్మర్ ఎక్కడం చేయకుండా వెంటనే మా సిబ్బంది కి తెలపాలని కోరారు. విద్యుత్ పట్ల రైతులు, ప్రజలు అప్రమతంగా ఉండాలని సూచించారు. విద్యుత్ ఏదైనా సమస్యలు ఉంటే 87124 83652 నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు.

మంత్రి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

నేలకొండపల్లి, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ని బుధవారం తెలంగాణ సెక్రటేరియట్ లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, ఇరగదిండ్ల నాగరాజు, బీ.సతీష్ లు కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చం అందించి..ఘనంగా సన్మానించారు. మండలం లోని సుర్దేపల్లి లో సర్పంచ్ గరిడేపల్లి సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గువ్వలగూడెం లో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా 'పంచాయతీ సర్పంచ్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ 119 కొత్వాల్ గూడ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం

రాజేంద్రనగర్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : నవంబర్ 2వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహా పాదయాత్ర కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమం గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది.ఎం.ఎల్.సి ఎన్నిక గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పెండ్యాల మాజీ సర్పంచ్ యాదయ్య,మేడ్చల్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి సేవెళ్ళ మహేందర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు,బీజేవైఎం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణానగర్ రైతు బజార్‌లో లక్ష్మీ అపర్ణ ప్రచారం

- అభివృద్ధి పనుల కొనసాగింపునకు సహకరించండి: లక్ష్మీ అపర్ణ కోవెలమూడి

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ కృష్ణానగర్‌లోని రైతు బజార్‌ను సందర్శించి ప్రచారం నిర్వహించారు. నవంబర్ 1న జరిగే పోలింగ్‌లో బ్యాలెట్‌పై సైకిల్ గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి తనను మేయర్‌గా, కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధికి కూటమికి అండగా నిలవాలని కోరారు.

ఈ సందర్భంగా లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే రైతు బజార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని పేర్కొన్నారు. కృష్ణానగర్ రైతు బజార్‌లో సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో రెండు అంతస్తుల భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, నిర్మాణ పనులు కొన్ని నెలల్లో పూర్తవుతాయని అన్నారు. జరుగుతున్న అభివృద్ధికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు.

నేటి సాయంత్రం 5 గంటలకు ప్రచారం బంద్

- ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి: నగర కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగర పాలక సంస్థ సాధారణ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని పూర్తిగా నిలిపివేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు నగర పాలక సంస్థకు నవంబరు 1న ఆదివారం ఎన్నికలు నిర్వహించనున్నందున, పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుంచే ఎన్నికల ప్రచారంపై నిషేధం అమల్లోకి వస్తుందని కమిషనర్ తెలిపారు. అందువల్ల అక్టోబరు 30న శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత ఎలాంటి ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు ప్రచార నిషేధానికి సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించకుండా సహకరించాలని కోరారు.

మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం–1955లోని సెక్షన్ 600 ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల వ్యవధిలో ఎన్నికలకు సంబంధించిన బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార కార్యక్రమాలు, చట్టం నిషేధించిన ఇతర కార్యకలాపాలను నిర్వహించరాదని కమిషనర్ తెలిపారు.

ఈ నిబంధనలు అక్టోబరు 30న సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి మద్దతుదారులు నిషేధిత ఎన్నికల ప్రచార కార్యక్రమాలను నిర్ణీత సమయానికి ముందే నిలిపివేయాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ ఎన్నికల నియమావళిని పాటించాలని కమిషనర్ కోరారు.

మాగుంటకు ఘనంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే డా.ఉగ్ర, పువ్వాడి,దారపనేని, బైరెడ్డి

కనిగిరి అక్టోబర్ 29(జర్నలిస్ట్ ఫైల్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండల కూటమి బలపరిచిన జడ్పిటిసి అభ్యర్థి సమీక్షా సమావేశంలో పాల్గొనటానికి పామూరు విచ్చేసిన పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డికి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నర్సింహారెడ్డి, జడ్పిటిసి అభ్యర్థి జాహ్నవి రెడ్డి, తర్వాత కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, గద్దె గంగయ్య చౌదరి,పామూరు మండల ఎంపీపీ అభ్యర్థి పువ్వాడి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు ఉప్పలపాటి హరిబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షులు చుంచు కొండయ్య, కోడిగుడ్లపాడు ఎంపీటీసీ పువ్వాడి వెంకటలక్ష్మి, గోళ్ళ భాస్కర్ రావు, పామూరు ఒకటవ ఎంపీటీసీ వరి కూటి చిరంజీవి, రెండవ ఎంపీటీసీ గాలి వెంకట్ , మూడవ ఎంపీటీసీ ఆర్ఆర్ రెహానా రఫీ, నాలుగో ఎంపీటీసీ షేక్ దిల్షాద్ చినహాజిమలన్ , ఐదో ఎంపీటీసీ అంచూరి వెంకట్ రెడ్డి, కంబాలదిన్నె ఎంపీటీసీ పోక వెంకటరత్నం, మోపాడు ఎంపీటీసీ మోరు పోయిన గిద్దయ్య యాదవ్, దాదిరెడ్డిపల్లి ఎంపీటీసీ గుర్రం నాగేశ్వరరావు, వగ్గంపల్లి ఎంపీటీసీ ఏలికా నారాయణ, కోడిగుడ్లపాడు టిడిపి నాయకులు మానం మల్లికార్జునరావు, దారపనేని రాజేంద్రప్రసాద్, మట్లే రాహుల్ యాదవ్, యరశింగ్ రాయుడు, మొరు బోయిన నరసింహారావు, పామూరు మాజీ సర్పంచ్ లు డివి మనోహర్ ప్రసాద్, కావిటి సుబ్బయ్య, యాదాల వెంకట సాయి కిరణ్, సోమిశెట్టి నారాయణ, బిజెపి నాయకులు కొండిశెట్టి వెంకటరమణయ్య, తదితర టిడిపి శ్రేణులు మాగుంటకు ఘనంగా స్వాగతం పలికారు.

కోవెలమూడితో యరపతినేని మర్యాదపూర్వక భేటీ



గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర నానిని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని మాట్లాడుకున్నారు. ఈ భేటీలో కంచర్ల శివప్రసాద్ గారు, జాస్తి రమేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమంలో రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు

- కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు
- సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణతో కలిసి 25,26, 27 డివిజన్లలో విస్తృత ఎన్నికల ప్రచారం
- గత వైసీపీ పాలనలో గంజాయి, అస్తవ్యస్త డ్రైనేజీలతో నాశనమైన డివిజన్లు - కూటమి ప్రభుత్వంలో మారిన రూపురేఖలు
- మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ సహా కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమంలో రూ. 450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 25,26, 27 డివిజన్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. సత్తెనపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణతో కలిసి స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...ఒకటో తారీఖున జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీం–ర్వదించాలని కోరారు. గతంలో కలిసి ఉన్న 25, 26, 27 డివిజన్ల ప్రజలు ఒకసారి గతాన్ని, వర్తమానాన్ని బేరీజు వేసుకోవాలన్నారు. గతంలో కన్నా లక్ష్మీనారాయణ గారు ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా తీర్చిదిద్దితే, ఆ తర్వాత వచ్చిన గత వైసీపీ పాలకులు, కార్పొరేటర్లు ఈ ప్రాంతాన్ని పూర్తిగా ధ్వంసం చేశారని మండిపడ్డారు. కనీసం చెత్త ఎత్తే దిక్కులేక, సరైన రోడ్లు, కాలవలు లేకుండా చేసి, గంజాయికి అడ్డాగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ రెండున్నర సంవత్సరాల కూటమి ప్రభుత్వంలో అక్కడ వైసీపీ కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, కూటమి నాయకులు చిత్తశుద్ధితో పనిచేసి ఈ ప్రాంత రూపురేఖలను సమూలంగా మార్చివేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎటు చూసినా పరిశుభ్రమైన రోడ్లు, కాలవలు కనిపిస్తున్నాయంటే అది కూటమి నాయకుల నిబద్ధతేనని స్పష్టం చేశారు.

?రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. అదే స్ఫూర్తితో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు రూ. 450 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన పనులు కూడా వేగంగా పూర్తి కావాలంటే సమర్థవంతమైన నాయకత్వం స్థానికంగా ఉండాలన్నారు.

ఎన్నికల సమయంలో కులం, ప్రాంతం పేరుతో మభ్యపెట్టే వారికి ఓటు వేస్తే మళ్లీ ప్రాంతం వెనకబడిపోతుందని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు.

నగర మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు 25వ డివిజన్ అభ్యర్థి త్రిపుర వాసవి, 26వ డివిజన్ అభ్యర్థి షాజహాన్, 27వ డివిజన్ అభ్యర్థి ఉల్లి గోపాల్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి ఆశీం–ర్వదించాలని, నగర సమగ్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు

అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 47వ డివిజన్ ఎన్డీయే కూటమి అభ్యర్థి పఠాన్ షమా గారికి, మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకి మద్దతుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి , హజ్ కమిటీ చైర్మన్ హాసన్ బాషా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గుంటూరు నగరానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకం వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందని వివరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ, నగర ప్రగతికి ప్రజల సహకారం అవసరమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు.

కూటమికి నూరుశాతం విజయం ఖాయం

- ప్రగతిని, సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి
- మీ ప్రాంతంలో గత పాలనకు, ఇప్పటి పాలనకు తేడా చూడండి
- రెండున్నరేళ్లలో రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతులు పరిశీలించండి
- మీ ఓటుతో గుంటూరు నగరాభివృద్ధికి నాంది
- ఓటరులారా కూటమి అభ్యర్థులను గెలిపించండి
- 68,71,72 డివిజన్లలో ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): “ఓటరులారా ఆలోచించండి.. కేవలం రెండేళ్ల కాలంలో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో ఒక్కసారి పరిశీలించుకోండి. గత ఐదేళ్లలో గుంటూరు నగరం ఎంత సర్వనాశనమైందో గుర్తు చేసుకోండి. మీరిచ్చిన తీర్పు గుంటూరు నగరాభివృద్ధి మార్పునకు నాంది కాబోతోంది’ అని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక 68, 71, 72 డివిజన్ల కూటమి బలపరిచిన అభ్యర్థులు వంగర ఏడుకొండలు, గుడిమెట్ల దయారత్నం, యర్రగుంట్ల ఆనంద్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి డివిజన్ లోనూ ఎమ్మెల్యే, కూటమి నాయకులకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ హారతులిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే సంక్షేమాన్ని తీసుకొస్తున్నామన్నారు. ఇది మనసున్న ప్రభుత్వమని, ప్రజల సంతోషమే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల మంచినీటి అవసరాలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టామన్నారు. దీంతోపాటు పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఇది కేవలం ఎన్నికలే కాదని, ప్రజల అభ్యున్నతికి, యువత భవితకు నాంది కానుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం తోడుగా నిలుస్తుందనే నమ్మకాన్ని కలిగించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని ఎక్కడ అని గూగుల్ అడిగినా చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో రూ. 400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల గుమ్మానికి తీసుకెళ్లామని, మీ ఓటు ద్వారా మరింత అభివృద్ధి సాధించబోతున్నామని తెలిపారు. కేవలం అభివృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా పథకాలు, కార్యక్రమాలు చేపట్టామన్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూముల భద్రతా ఏర్పాట్ల పరిశీలన

- స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత, నిరంతర నిఘా ఉండాలి
- గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు.

నంబూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను గురువారం ఉదయం 11.40 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు ఎస్పీ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

స్ట్రాంగ్ రూముల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతా విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఎస్పీ సూచించారు. స్ట్రాంగ్ రూముల పరిసరాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని, నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికలకు సంబంధించిన కీలక సామగ్రి భద్రంగా ఉండేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

అనంతరం పెదకాకాని గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను ఎస్పీ పరిశీలించారు. ఓటర్ల కోసం బారికేడింగ్, క్యూలైన్ల ఏర్పాట్లు చేయాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఈ తనిఖీల్లో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, నార్త్ డీఎస్పీ కె. వెంకటేశ్వర్లు, పెదకాకాని సీఐ నారాయణస్వామి, మంగళగిరి రూరల్ సీఐ చిరుమామిళ్ల వెంకట్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే : ఓటర్లకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపు

- పన్నులు భారం - ధరలు ఘోరం- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- కూటమితో చేటు - ఓటుతో వేటు- వైసీపీ ఎన్నికల పరిశీలకుడు పండుగాయల

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగర సమగ్రాభివృద్ధిని కాంక్షించే వారంతా తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి వైసీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ఓటరు మహాశయులకు పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ గుంటూరు మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు పండుగాయల రత్నాకర్ తదితర నేతలతో కలసి వచ్చిన తమ అభిమాన నాయకుడు లేళ్ళ అప్పిరెడ్డిని చూసి ఆనంద తీర్థ (ఏటీ) అగ్రహారం ఆనంద తాండవం చేసింది. మాన్యం మంగళ హారతులు పట్టింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వారు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక అభ్యర్థి యర్రం కృష్ణారెడ్డి, మేయర్ అభ్యర్థిని తాడికొండ శ్రీదేవిని గెలిపించాలని కోరుతూ వారు నిర్వహించిన పాదయాత్రకు స్థానిక ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. “మా ఓటు ఫ్యాను గుర్తుకే” అన్న స్థానిక ఓటర్ల నినాదంతో 40వ డివిజన్ మార్మోగిపోయింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన గుంటూరును వైసీపీ హయాంలో ప్రగతి బాట పట్టించిన వాస్తవం ప్రజలందరికీ తెలిసిందేనని మరోసారి గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరులో అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆరోపించారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం చేతగాని ఈ ప్రభుత్వ వైఖరిపై ప్రజలందరూ భగ్గుమంటున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో జరుగనున్న ఎన్నికల్లో వెలువడే తీర్పు ప్రభుత్వం పట్ల ప్రజలలో పెల్లుబుకుతున్న వ్యతిరేకతకు అద్దం పడుతుందని ఆయన స్పష్టం చేశారు. మంచి పాలన కావాలన్నా.. మన గుంటూరు నిజంగా అభివృద్ధి చెందాలన్నా.. వైసీపీ అభ్యర్థులకే పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో ఏం సరుకులు కొనాలన్నా సామాన్యులు భయపడే దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. ఓవైపు పన్నుల భారం, మరోవైపు ధరల ఘోరంతో కూటమి ప్రభుత్వం నిరుపేదల నడ్డి విరుస్తుందని విమర్శించారు. ధరల దెబ్బకి కూలీలే కాక ఉద్యోగులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ గుంటూరు మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు పండుగాయల రత్నాకర్ మాట్లాడుతూ, ప్రజలకు చేటు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ఓటుతో వేటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రంగాలలో విఫలమై, అన్ని వర్గాలకు దూరమైన ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏవగించుకుంటున్నారని ఆయన వివరించారు. ఈ క్రమంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని వైసీపీ మరోసారి దక్కించుకుంటుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ రవి, అంగడి శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ సభ్యులు బ్రహ్మారెడ్డి, బొట్టిశెట్టి వెంకట్రావు, దేవా, కృష్ణారావు, సింగు నరసింహరావు, సాగర్, తోట వెంకటేష్, రామిరెడ్డి, శారద, రమణ, వెంకాయమ్మ, కోటయ్య, గుబ్బా సతీష్, అద్దేపల్లి కిషోర్, అనిల్, సాయి, వినోద్, నవీన్, అంబటి సీతారాం, వనిమిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా తెనాలిలో స్ట్రాంగ్ రూమ్ లు, పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి. యం. సాయికాంత్ వర్మ గురువారం తనిఖీ చేశారు. తెనాలి పురపాలక సంఘం ఎన్నికల సామాగ్రి స్వీకరణ, స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ ఏర్పాట్లను వి. ఎస్. ఆర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నారు. జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలకు సైతం తెనాలి డివిజన్ కు సంబంధించి అదే కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, తెనాలి పురపాలక సంఘం కమిషనర్ జె రామ అప్పలనాయుడుతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. పంపిణీ కేంద్రం వద్ద సామాగ్రి పూర్తి స్థాయిలో ఉండాలని, ఏ సామాగ్రి లోటు ఉండరాదని ఆదేశించారు. ఫలహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను ఎన్నికల సిబ్బందికి చేయాలని అన్నారు. రూట్ ల వారిగా వాహనాలు సిద్ధంగా ఉండాలని, పిఓలు, ఏపిఓలు, సిబ్బంది హాజరు చూడాలని అన్నారు.

ఎన్నికల సామాగ్రి స్వీకరణ (రిసెప్షన్) కేంద్రం వద్ద వాహనాల రాకపోకలపై స్పష్టత ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ట్రాఫిక్ జామ్ సమస్య ఉండరాదన్నారు. ఎన్నికల సిబ్బంది వాహనం దిగి నేరుగా రిసెప్షన్ కౌంటర్ వద్ద ఎటువంటి ఆలస్యం లేకుండా సామాగ్రి అప్పగించాలని చెప్పారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద తగినంత సిబ్బందిని నియమించాలని సూచించారు. సిబ్బందికి మంచి నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ల వద్ద సిసి కెమెరా ఏర్పాటు పక్కాగా ఉండాలని సూచించారు. మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు. పంపిణీ కేంద్రం, రిసెప్షన్ కౌంటర్ వద్ద ఎటువంటి అసౌకర్యం, ఆలస్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరుగుటకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటర్లకు వారు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తగు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):బ్రహ్మంగారిమఠం మండలంలో తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి నాగి పోగు పుల్లయ్య విజయమే లక్ష్యంగా ప్రచారం హోరెత్తింది. మైదుకూరు శాసనసభ్యులు పుట్ట సుధాకర్ యాదవ్ దివ్య ఆశీస్సులతో నాయకులు కార్యకర్తలు మరియు వార్డు ప్రజల అపూర్వ స్పందన మధ్య పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రచారాన్ని ముందుకు నడిపించారు. బ్రహ్మంగారి మఠం పట్టణంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ టిడిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి నాగి పోగు పుల్లయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వార్డు అభివృద్ధి నాగిపోగు పుల్లయ్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఆయన గెలుపు కోసం శ్రమిస్తామని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పునరుద్ఘాటించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

థలసేమియా బాధితుల కోసం ఎన్ఆర్ఐటీలో రక్తదాన శిబిరం

○ 45 యూనిట్ల రక్తం సేకరణ

మేడికొండూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):: ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, గుంటూరుకు చెందిన రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఈ–బ్లాక్ సెమినార్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. థలసేమియా బాధితులకు అవసరమైన రక్తాన్ని అందించడంతో పాటు, స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

శిబిరంలో మొత్తం 45 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్‌కు చెందిన డా. మహేష్, ప్రతినిధి టి. నవీన్, వారి బృందం శిబిరం నిర్వహణలో సహకరించారు. థలసేమియా బాధితులకు తరచూ రక్తం అవసరమవుతుందని, ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. డోలా సంజయ్ ఎస్., చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, అడ్మిన్ మేనేజర్ బి. సీతారామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షేక్ లాల్ జాన్ బాషా రక్తదాన శిబిరాన్ని అభినందించారు. విద్యార్థుల్లో సేవాభావం, మానవతా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి

○ ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

వేమూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు. గురువారం కొల్లూరు మండల కేంద్రంలోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో నిర్వహించిన కూటమి పార్టీల సమావేశంలో ఆయన పాల్గొని ఎన్నికల కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యత ఇస్తోందని, సూపర్ సిక్స్ హామీలతో పాటు మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని నక్కా ఆనంద బాబు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనకు రాజకీయ స్థిరత్వం అవసరమని, కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల మధ్య సమన్వయంతో అభివృద్ధిని వేగవంతం చేయవచ్చన్నారు. అర్నబ్ తుఫాను నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలను వివరించి, నష్టపోయిన ప్రజలు, రైతులకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.

అనంతరం వేమూరు గ్రామంలో కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వేమూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి వేల్పుల రవిప్రసాద్, ఎంపీటీసీ–1 అభ్యర్థి రాయల వినయ్, ఎంపీటీసీ–2 అభ్యర్థి పిల్లి రమ్యశ్రీలకు మద్దతుగా ఓటర్లను కలిశారు. టీడీపీ అభ్యర్థులకు సైకిల్, జనసేన అభ్యర్థులకు గాజు గ్లాసు, బీజేపీ అభ్యర్థులకు కమలం గుర్తులపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలంలో దిగి... సమస్యలు తెలుసుకుని...

తెనాలి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):: అర్నబ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా వరి పంట నేలవాలిన తెనాలి మండలంలో పలు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ గురువారం పర్యటించారు.

సోమసుందర పాలెం, కంచరపాలెం గ్రామాల్లో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడిన తరువాత నేరుగా పొలాల్లోకి దిగి పంటల పరిస్థితిని పరిశీలించారు. వర్షం పడటం గాలి ఎక్కువగా రావడంతో వారిపై నేలకు ఒరిగిందని కొద్ది రోజులు పాటు ఇదే స్థాయిలో ఉంటే పంటలు దెబ్బతింటాయని రైతులు చెప్పారు. దీనిపై వెంటనే వ్యవసాయ అధికారులతో మాట్లాడి వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు సలహాలు అందించాలని ఆదేశించారు.

వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించి పంటలను రక్షించుకునే చర్యలు చేపట్టాలని కోరారు. నిలువ ఉన్న నీటిని తక్షణం బయటికి పంపించే విధంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారుల ఆదేశించారు.

జిల్లా వ్యాప్తంగా మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంటలు కాపాడుకునే విధంగా తగిన రైతులకు సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. నీరు ఎక్కడ నిలువ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు ఎక్కడ నష్టపోకుండా నిరంతరం వారికి సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు. పంట నష్టాలు జరిగితే వాటి నివేదికను అందజేయాలని ఆదేశించారు.

వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్తలు డా. సిహెచ్ సుజాని రావు, డా. ఎం రత్నం, డా. ఎన్. సాంబశివరావు ఇందులో పాల్గొని రైతులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, తాసిల్దార్ గోపాలకృష్ణ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తెనాలి అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి

○ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలి - ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): తెనాలి పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను ప్రజలు ఆదరించి, అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. తెనాలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి: తెనాలి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలంటే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వం అవసరమని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి, వార్డుల వారీగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతగా ఉండాలని తెలిపారు.

కూటమి ఐక్యతతోనే అభివృద్ధికి బాటలు : తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని ఎమ్మెల్సీ ఆలపాటి కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికలు కేవలం పదవుల కోసం జరిగే ప్రక్రియ కాదని, పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక సందర్భమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసే అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత : తెనాలి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి నాయకత్వం కృషి చేస్తుందని ఆలపాటి పేర్కొన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా చూడటంతోపాటు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం ముఖ్యమన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడం, అంతర్గత రహదారుల అభివృద్ధి, మురుగునీటి సమస్యల పరిష్కారం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని బాధ్యతగా స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యమని స్పష్టం చేశారు.

అభివృద్ధి కొనసాగాలంటే ప్రజల సహకారం అవసరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లో సమర్థవంతమైన నాయకత్వం ఉండాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని, ఎన్నికల అనంతరం ప్రజలకు జవాబుదారీగా పనిచేయడం నాయకుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని సంపాదించడం ఎంత ముఖ్యమో, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.

ప్రజల తీర్పు అభివృద్ధికి దిశానిర్దేశం కావాలి : తెనాలి పట్టణానికి చారిత్రకంగా, వాణిజ్యపరంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ఖ్యాతిని మరింత పెంచేలా పట్టణాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల భాగస్వామ్యంతో సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని అన్నారు. కూటమి అభ్యర్థులు ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రజల ఆశలు మరియు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, పట్టణ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, "తెనాలి అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ, ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యం. పట్టణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. తెనాలి పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరుతూ తన ప్రసంగాన్ని ముగించారు. "ప్రజల విశ్వాసమే మా బలం.. తెనాలి అభివృద్ధే మా లక్ష్యం" అనే నినాదంతో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి మద్దతు కూడగట్టాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. సమావేశంలో కూటమి పార్టీ నాయకులు వాసుదేవానాయుడు, అశోక్ వర్ధన, జొన్నాదుల మహేష్, పాలడుగు సురేంద్ర, మల్లవరపు విజయ్, శ్యామ్, షేక్ జిలాని, మంగమూరి హైమారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లే

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం , అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): విశాఖపట్నం నగరంలోని 88వ వార్డు గౌంతినవానిపాలెం, 98వ వార్డు శ్రీనగర్, 85వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు.

88వ వార్డు కూటమి అభ్యర్థి సిరసపల్లి నూకరాజుకు, 98వ వార్డు అభ్యర్థి దేనంకొండ కృష్ణంరాజుకు, 85వ వార్డు అభ్యర్థి గొర్రపాటి సునీతకు కమలం గుర్తుపై, మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పీవీఎన్ మాధవ్ ప్రజలను కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరాభివృద్ధికి మరింత సమన్వయంతో పనిచేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల మధ్య సమన్వయమే అభివృద్ధికి కీలకం అని ఆయన అన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా కూటమి కృషి చేస్తుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ గొర్లె సత్యనారాయణ, సంతోష్ నాయుడు, పావని, వరహాలరావు, జాగారపు శ్రీను, కిరణ్ శర్మ, బగ్గు ఈశ్వరరావు, ప్రసాద్, గోవింద్, నాయుడు, రమాదేవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిశెట్టి సోదరుల నివాసంలో ఎన్నికల సందడి..
లక్ష్మీ అపర్ణకు ఘన స్వాగతం



గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): తాడిశెట్టి సోదరుల నివాసంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, స్థానిక కార్పొరేటర్ అభ్యర్థి తాడిశెట్టి ఉత్తేజ్, మాదాల చైతన్య, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ.. మేయర్ అభ్యర్థిగా తనను, కూటమి కార్పొరేటర్ అభ్యర్థిగా తాడిశెట్టి ఉత్తేజ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహిస్తూ వారికి అవకాశాలు కల్పించడం అభినందనీయమని, సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో ఉత్తేజ్ రాజకీయాల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నగర అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, ప్రజల ఆశీస్సులు, సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. 42వ డివిజన్‌లో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్తులో గుంటూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. 42వ డివిజన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి తాడిశెట్టి ఉత్తేజ్‌ను, మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. లక్ష్మీ అపర్ణ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె సహకారంతో గుంటూరు నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని గల్లా మాధవి పేర్కొన్నారు.

తాడిశెట్టి ఉత్తేజ్ మాట్లాడుతూ.. ముందుగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్, ఎమ్మెల్యే గల్లా మాధవి గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి ఈ వార్డుతో ఎంతో అనుబంధం ఉందని, ప్రజలకు 100 శాతం నిబద్ధతతో సేవలందిస్తానని చెప్పారు.

మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ మార్గదర్శకత్వంలో పనిచేస్తూ వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెడతానన్నారు. ఎన్డీఏ కూటమి నాయకుల సహకారంతో ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు ఒక్కసారి అవకాశం కల్పించాలని, తన పనితీరుతో నిరూపించుకుంటానని కోరారు.

కూటమితోనే అభివృద్ధి పరుగులు..

○ ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం ,ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతాం: లక్ష్మీ అపర్ణ కోవెలమూడి

○ అభివృద్ధి బాటలో గుంటూరు.. కూటమికి అండగా నిలవండి

○ చెట్లు నాటేవారెవరో.. నరికేవారెవరో గుర్తించి ఓటు వేయాలి: కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పశ్చిమ నియోజకవర్గంలోని 1, 2, 75, 76 డివిజన్లలో కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు.

కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వంలో ప్రజలు అభివృద్ధిని చూస్తున్నారని, నగరంలో మరింత అభివృద్ధి జరగాలంటే తమ అమూల్యమైన ఓటుతో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలు ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గెలిచిన తర్వాత ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ అండగా నిలుస్తామని తెలిపారు.

కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ డివిజన్ల పరిధిలో రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వచ్చే మూడేళ్లలో ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. నందివెలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను త్వరలో పూర్తి చేస్తామని, గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ వైద్య సేవలను బలోపేతం చేస్తామని వివరించారు. చెట్లు నాటేవారెవరో, చెట్లు నరికేవారెవరో గుర్తించి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నగర అభివృద్ధి కొనసాగేందుకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే రూ. 200 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బీఆర్ స్టేడియాన్ని రూ. 14 కోట్లతో ఆధునికీకరిస్తున్నామని, రూ. 2 కోట్లతో పలు డ్రైనేజీ పనులు చేపడుతున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి పనులు మరింత ముందుకు సాగేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధికి పట్టం కట్టినట్లే : మంత్రి దుర్గేష్

○ 2,22,26 వార్డుల కూటమి అభ్యర్థుల తరపున మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ప్రచారం

నిడదవోలు, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధికి పట్టం కట్టినట్లే అని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు పట్టణంలోని 2,22,26వ వార్డుల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు దేవళ్ల సత్య శైలజ (టీడీపీ), పుల్లేటికుర్తి వెంకటేష్ (జనసేన), కుతాడ శివ (జనసేన) తరపున మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. కూటమికే ఓటేసి అభివృద్ధి కొనసాగిస్తామని ప్రజలు ముక్తకంఠంతో చెప్పారు..

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..నిడదవోలు అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు, కూటమి సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ అందేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టాలు తప్పిన పరిపాలనా వ్యవస్థను, సంక్షోభంలో పడ్డ ఆర్థిక స్థితిగతులను కూటమి ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్ల కాలంలోనే పూడ్చి, సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్తోందని వివరించారు. ఈ ప్రగతి ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి కుటుంబానికీ, ప్రతి ఇంటికీ చేరాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి పట్టంకట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వాలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా కూటమికి అధికారమిస్తే నిధుల సాధన, అభివృద్ధి పనుల ఆమోదం చాలా వేగంగా జరిగి పట్టణం సర్వాంగ సుందరంగా మారుతుందని తెలిపారు. అట్టడుగు వర్గాలకు సమున్నత గౌరవం ఇవ్వడమే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి లక్ష్యమని ఈ నేపథ్యంలో కూటమి బలపరిచిన మున్సిపల్ ఛైర్ పర్సన్ అభ్యర్థి మురాలజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించి కొత్త నాయకత్వానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో ఉన్న టీడీపీ సీనియర్ నేతకు ఆలపాటి పరామర్శ

తెనాలి, అక్టోబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్): తూములూరు గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు చాగంటి సుబ్బారెడ్డి అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, గుంటూరు––కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆయనను పరామర్శించారు.

చాగంటి సుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆలపాటి.. ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యుడికి ఫోన్ చేసి సుబ్బారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆలపాటి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని సూచించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com